# ప్రసంగి గ్రంథ పరిచయము

టి.పి. వరప్రసాద రెడ్డి



సమస్తము వ్యర్థమని ప్రసంగి చెప్పుచున్నాడు

# ప్రసంగి గ్రంథ పరిచయము

రచయిత
**టి.పి. వరప్రసాద రెడ్డి**
13-1-765, రెవిన్యూ కాలనీ
అనంతపూర్ - 515 001

Published by
**GOSPEL ASSEMBLY PUBLISHING**
7-270, Court Road
ANANTAPUR - 515 001.
Andhra Pradesh

మొదటి ముద్రణ : నవంబర్ 7, 2007

ప్రతులు : 2000

వెల రూ. 10-00

**ప్రతులకు**

**టి.పి. వరప్రసాద రెడ్డి**
13-1-765, రెవిన్యూ కాలనీ
అనంతపూర్ - 515 001
సెల్ : 9440285883

**జి. రాజారావు**
పెద్దకాకాని - 522 509
గుంటూరు జిల్లా

**లోగోస్ బుక్ సెంటర్**
10/1, అరండల్ పేట
గుంటూరు - 522 006
ఫోన్ : (0863) 2336927

*Designed & Type Setting :*
*LOGOS GRAPHICS*
Rajendra Nager 3rd Line,
GUNTUR - 522 006 Ph : 2230827

*Printed at :*
**Sudarsan Printers,**
GUNTUR. Ph : 2246245

# ప్రసంగి

గ్రంథకర్త : సొలొమోను (1:1,12) కాలము : క్రీ.పూ. 940–930

**ముఖ్య ఉద్దేశము :** సూర్యుని క్రింద నరులు పడుచుండు పాటు అంతటి వలన వారికి కలుగుచున్న లాభమేమి ? **జవాబు :** లాభమేమియులేదు. సమస్తము వ్యర్థమని తేల్చి చెప్పబడినది. కాని ప్రభువునందలి ప్రయాస వ్యర్థము కాదని 1 కొ. 15:58లో వ్రాయబడింది. ప్రసంగి గ్రంథములోని అనేక ఫలితముల సారాంశముగా దేవుని యందు భయభక్తులు కలిగి ఉండుట మానవ కోటికి విధి అని ప్రసంగి 12:13లో చెప్పబడినది.

ఈ గ్రంథము పేరు హెబ్రీ భాషలో 'కహోలెత్' (KOHELETH) అన్నారు. అరబిక్, హిందీభాషలలో కహోనా అంటే చెప్పుట, బోధించుట, ప్రసంగించుట అని అర్థము. తెలుగులో ప్రసంగి అని, గ్రీకు, ఇంగ్లీషు భాషలలో ECCLESIASTES అని అన్నారు.

పరిశుద్ధ గ్రంథములో సొలొమోను విరచిత గ్రంథాలు మూడు పొందుపరచబడ్డాయి. అవి (1) సామెతలు; (2) ప్రసంగి; (3) పరమగీతము. ప్రసంగి 12:9లో ప్రసంగి జ్ఞానియై ఉండి ... అనేక సామెతలను అనుక్రమపరచెను అని వ్రాయబడి ఉండడము వల్ల సామెతల గ్రంథము వ్రాసిన తర్వాతనే ప్రసంగి గ్రంథము వ్రాయబడెను. పరమగీతము 6:8లో 60 మంది రాణులు, 80 మంది ఉపపత్నులు, లెక్కకు మించిన కన్యకలు కలరు అన్నారు. ప్రసంగి 2:8లో బహుమంది ఉపపత్నులను ఉంచుకొంటిని అని భూతకాలములో చెప్పినందున పరమగీతము కూడా ప్రసంగి గ్రంథము కంటే ముందే వ్రాయబడినదని తెలుస్తున్నది. కనుక సొలొమోను యుక్తవయస్సు ప్రారంభములో సామెతలు, మధ్యవయస్సులో జీవితానుభవముతో పరమగీతము, వృద్ధాప్యములో దైవజ్ఞాన సంపూర్ణ జీవితానుభవాన్ని మేళవించి ప్రసంగి గ్రంథము వ్రాసినట్లు తెలియుచున్నది.

ఈ గ్రంథము పాతనిబంధన గ్రంథాలవరుసలో 21వది. ఇందులో 12 అధ్యాయాలు 222 వచనములు కలవు. ఈ గ్రంథములో చాలా సార్లు కనిపించు పదములు.

(1) వ్యర్థము – 34 సార్లు; (2) జ్ఞానము – 55; (3) సూర్యుడు – 27 (ఇంగ్లీషు బైబిల్‌లో – 34); (4) మేలు – 20 (ఇంగ్లీషు బైబిల్ – 22); (5) ప్రయాసం–20 + పాట్లు–2; (6) గాలికై చేసిన ప్రయత్నము–10; (7) లాభము – 9; (8) భూమిమీద–7;

(9) లోకమందు - 2; (10) సూర్యుని క్రింద - 22 + ఆకాశము క్రింద - 3 + భూమి మీద - 7, లోకమందు - 2 (మొత్తం-34 సార్లు); (11) నేను చూచితిని లేదా నాకు కనబడెను - 14; (12) నేను అనుకొంటిని-14; (13) నేను తెలుసుకొంటిని - 14.

ప్రసంగి గ్రంథములోని 'దేవుడు' అను పదానికి మూలభాషలో 'సర్వశక్తిమంతుడు' అని అర్థమిచ్చు 'ఎలోహిం' అను పదము వాడబడింది. ఈ పదము 40 సార్లు కలదు. కాని యెహోవా అను పేరు ఒక్కసారి కూడా లేదు. 34 పర్యాయములు వ్యర్థమని చెప్పబడిన గ్రంథమందు దేవుడు సర్వశక్తిమంతుడు అని 40 పర్యాయములు ప్రస్తావించడము వలన సర్వశక్తి గల దేవుని యందు భయభక్తులు కలిగి ఉండుట మానవులకు అత్యవసరమని నొక్కి వక్కానించడమైంది.

ఇందులో 'విచారించి, వివేచించి, శోధించి, చూచి, పరిశీలించి, ఆలోచించి, యోచించి, మనసునిలిపి, తెలుసుకొంటిని' అని అనేకసార్లు ఉంది. కనుక గ్రంథకర్త అనేక పరిశోధనల, పరీక్షల, పరిశీలనల మూలమున తెలిసికొనిన ఫలితమే ఈ గ్రంథ సారాంశము. సూర్యుని క్రింది మనుష్యుల పనిపాటులను దేవుని జ్ఞానముతో కాక, మనుష్య జ్ఞానముతో విచారించి జరిపిన పరిశోధనల ఫలితమే ఈ గ్రంథసారాంశము. మనుష్య జ్ఞానముతో విచారించినా, చివరకు దేవుని యందలి భయభక్తులకు నడిపించడము గొప్పవిశేషము.

ఈ గ్రంథ మందు అనేక పరిశోధనలు వాటి ఫలితములు కలవు. గ్రంథ ప్రారంభంలో సూర్యుని క్రింద (దేవుని జ్ఞానముతోకాక) చేయు పనులన్నిటి వలన లాభమేమి లేదు. సమస్తము వ్యర్థమని చెప్పి, చివరలో పరిశోధనల సారాంశముగా దేవుని యందు భయభక్తులు కలిగి ఉండి ఆయన కట్టడల ననుసరించి, నడచుచుండుటయే మానవకోటికి విధియని తెలుపుచున్నాడు (12:13). రోమా 8:20,21 ప్రకారము సృష్టి వ్యర్థ పరచబడినందున దేవుని యందలి భయభక్తులే మానవుల కవసరమైన విధి అని మనము నేర్చుకోవాలి. మొదటి ఆరు అధ్యాయాలలో జీవితకాల వ్యర్థతలను గూర్చి చెప్పి అక్కడ ఆపివేయక వ్యర్థమైన జీవితకాలమునకు అవసరమైన హెచ్చరికలను మిగిలిన ఆరు అధ్యాయములలో (7-12) చెప్పుచున్నాడు.

## ప్రసంగి గ్రంథ అధ్యాయముల విభజన

6 + 6 = 2 + 2 + 2 + 2 + 2 + 2 = 12

| | అధ్యాయములు | | వివరణ |
|---|---|---|---|
| I. | 1-6 | : | **సూర్యుని క్రింద జీవిత కాల వ్యర్థతలు** |
| 1. | 1-2 | : | **వ్యర్థమైన జ్ఞానాభ్యాసము (1 అ) - వ్యర్థమైన ఇహలోక సంతోషము (2 అ)** |
| | 1 | : | సూర్యుని క్రింద వ్యర్థమైన పాట్లు (2,3వ), వ్యర్థమైనజ్ఞానాభ్యాసము (16వ) |
| | 2 | : | ఇహలోక సంతోషము (4వ), సంపదలు (8వ) వ్యర్థము |
| 2. | 3-4 | : | **వ్యర్థమైన జీవితకాల ప్రయానములు(3 అ) - అన్యాయములు(4 అ)** |
| | 3 | : | వ్యర్థమైన జీవితకాల ప్రయాసములు (2-8వ), దేవునియందలి భయభక్తులే (14వ) శ్రేష్టము. |
| | 4 | : | సహవాసజీవిత అన్యాయములు (1వ) - సహవాస జీవితంలోని అసమానతలు (13-16వ). |
| 3 | 5-6 | : | **వ్యర్థమైన జీవితకాల ధన ధాన్య సమృద్ధి (5 అ) - అంత్యకాలస్థితి (6 అ)** |
| | 5 | : | వ్యర్థమైన జీవితకాల ధన ధాన్య సమృద్ధి (10వ) |
| | 6 | : | వ్యర్థమైన మానవుని ఘనత (2వ) - అంత్యకాల స్థితి (12వ). |
| II. | 7-12 | : | **సూర్యుని క్రింద వ్యర్థమైన జీవితకాలమునకు హెచ్చరికలు** |
| 4 | 7-8 | : | **జీవితానికి మేలైనవి (7అ) - క్షేమము కలిగించేవి(8అ)** |
| | 7 | : | జీవితకాలానికి మేలైన హెచ్చరికలు (1-8వ) |
| | 8 | : | జీవితకాలానికి క్షేమము కలిగించు దైవ భయము (12వ) |
| 5 | 9-10 | : | **జీవిత కాలమునకు జ్ఞాన సూక్తులు** |
| | 9 | : | సూర్యుని క్రింద జీవితం జ్ఞానంతో, సంతోషంతో (9వ) గడుపుటకైన హెచ్చరికలు |

| | | | |
|---|---|---|---|
| | 10 | : | సూర్యుని క్రింద జీవితంలో బుద్ధిహీనుని కంటే జ్ఞానియే శ్రేష్ఠుడను హెచ్చరిక |
| 6 | 11-12 | : | **జీవితంలో వివిధ దశలకు (11 అ), కాలాంతమునకు హెచ్చరికలు(12 అ)** |
| | 11 | : | జీవితంలో వివిద దశలకు హెచ్చరికలు (9-10వ). |
| | 12 | : | జీవిత అంతమును గూర్చిన హెచ్చరికలు (3-7వ) - గ్రంథసారాంశము. |

## సొలొమోను పరిశోధన ఫలితాలు

| అధ్యాయము | పరిశోధన విధము (బ్రాకెట్లలోనివి వచనములు) | ఫలితము |
|---|---|---|
| 1. | జ్ఞానముచే విచారించుట (13) | తెలిసికొంటిని 1:18-24 |
| 2. | అనుభవము (3) - యోచన (3) (వివేచన) (11) | తెలిసికొంటిని 2:24-26 |
| 3. | చూచుటచేత (16) | తెలిసికొంటిని3:12-14,22 |
| 4. | యోచించుట (1) - చూచుట (4) | తెలిసికొంటిని 4:16 |
| 5. | చూచుట (13, 18) | అనుకొనుచున్నాను 5:18,19 |
| 6. | చూచుట (1) ఆలోచించుట (3) | అనుకొనుచున్నాను 6:3 |
| 7. | చూచుట (15,26-28) శోధించుట (23) | కనుగొంటిని 7:29 |
| 8. | యోచించుట (9) | కనుగొంటిని 8:16<br>తెలిసెను 8:9, 7,<br>అనుకొంటిని 8:14 |
| 9. | ఆలోచించుట (11, 16) | తెలియబడెను 9:11<br>అనుకొంటిని 9:16 |
| 10. | చూచితిని (5, 7) | తెలియబడెను 10:20 |
| 11. | ఎరుగుట (8) | కనబడును 11:1 |
| 12. | ఆలోచన (9) | తేలిన ఫలితము 12:13 |

## 1వ అధ్యాయము

11 + 7 = 18వ

అంశం : సూర్యుని క్రింద వ్యర్థమైన నరులపాట్లు (2,3వ) - వ్యర్థమైన జ్ఞానాభ్యాసము (18వ)

**1-11వ. సృష్టిక్రమము - సూర్యుని క్రింద వ్యర్థమైన నరులపాట్లు :**

1వ : ఈ గ్రంథమందలి మాటలు పలికినవాడు దావీదు కుమారుడు, యెరూషలేములో రాజుగా ఉండినవాడు. (12) జ్ఞానము సంపాదించిన వాడు గనుక సొలొమోనే ఈ గ్రంథకర్త అని తెలియనగును. 2-3వ నరుల ప్రయాస వ్యర్థమని, లాభమేమిలేదని 34 పర్యాయములు ప్రస్తావించుచున్నాడు. 4-8వ. ఎడ తెరిపి లేక జరుగు సృష్టి క్రమమును ప్రస్తావించుచున్నాడు. భూమి, సూర్యుడు, గాలి, సముద్రము అను నాలుగింటి యొక్క ఎడతెరిపి లేని చర్యలను వివరిస్తున్నాడు. ఇవి మానవుని జ్ఞానమునకు అందవు కనుక మానవుడు వివరింపజాలడు. 9-11వ. సూర్యుని క్రింద నూతనమైన దేదియు లేదని, అన్నీ మునుపు ఉన్నవే అని చెప్పుచున్నాడు. అలాగే పూర్వులు జ్ఞాపకమునకు రాక మరువబడుదురని అంటున్నాడు.

ఈ గ్రంథములో 'లాభము' అనుపదము 9 పర్యాయములున్నది. వాటివివరములు.

1. 1:3 లాభమేమి? అనగా లాభములేదు.
2. 2:11 లాభకరమైన దేదియు లేనట్టు నాకు కనబడెను - అనగా లాభములేదు.
3. 3:9 కష్టపడిన వానికి లాభమేమి? - అనగా లాభములేదు.
4. 5:16 గాలికి ప్రయాసపడి సంపాదించుటవలన లాభమేమి? - అనగా లాభములేదు.
5. 6:11 పలుకబడిన మాటలలో నిరర్థకమైనవి ఉండును గనుక నరులకు లాభమేమి - అనగా లాభములేదు
6. 7:11 జ్ఞానము స్వాస్థ్యమంత లాభము.
7. 7:12 జ్ఞానము వలన ప్రాణాపాయమునుండి రక్షణ కలుగుట అను లాభము కలదు.
8. 8:15 అన్న పానములు పుచ్చుకొనుట కంటే లాభకరమైనది లేదు.
9. 9:5 నరులు చనిపోయి మరువబడుదురు గనుక లాభము లేదు.

**12-18 వ. వ్యర్థమైన జ్ఞానా భ్యాసము :**

12-13వ. మానవులకు దేవుడు ఏర్పాటు చేసిన ప్రయాసము బహుకఠినమైనది. 3:10 లో నరులు అభ్యాసము పొందవలెనని దేవుడు వారికి కష్టానుభవమును పెట్టెను అంటున్నాడు. సూర్యుని క్రింద జీవితంలో దేవుడు ప్రయాసను, కష్టానుభవమును పెట్టినట్లు

ప్రసంగి చెప్పుచున్నాడు. 14-15వ. సూర్యుని క్రింద జరుగుచున్న క్రియలన్నియు ప్రయాస, కష్టముతో కూడిన వైనందున సమస్తము వ్యర్థమని చెప్పుచున్నాడు. ఎంత ప్రయాసపడినను లోపముగా నున్న, వంకరగా నున్న జీవితమును చక్కపరచలేము. లోపములు ఎక్కువై, లెక్కలేనన్ని ఉన్నవి. మానవుల ప్రయాస, గాలి కొరకు ప్రయాసగా ఉన్నందున సమస్తము వ్యర్థమని చెప్పుచున్నాడు. 16-18వ. ప్రసంగియైన సొలొమోను తనకు ముందున్న వారికంటె ఎక్కువ జ్ఞానము అభ్యసించి, తానునేర్చుకున్న జ్ఞానాభ్యాసము చేత వెర్రితనమును, మతిహీనతను తెలుసుకొన ప్రయత్నించెను. విస్తార జ్ఞానాభ్యాసము చేత, విస్తార దుఃఖము, అధికజ్ఞానమను ఫలమును సంపాదించితిని అని హృదయమందు అనుకొనెను (2:15) దీని వలన జ్ఞానాభ్యాసము వ్యర్థమగుటయేగాక, ఒకడు గాలికై ప్రయాసపడినట్లే అని తెలిసికొనెను.

## 2 అధ్యాయము

3 + 3 + 2 + 3 + 3 + 3 + 3 + 3 + 3 = 26

అంశము : ఇహలోక సంతోషము - సంపదలు వ్యర్థములు.

**1-3వ : ఇహలోక సంతోషము ద్వారా మేలు అనుభవించ వచ్చునేమో అని ప్రయత్నించుట :**

1-2 వ. మనసును సంతోషింపజేయుట ద్వారా హృదయమునకు మేలు కలుగునేమో అని ప్రయత్నించెను. సామె 14:13 లో ఒకడు నవ్వుచుండినను హృదయమున దుఃఖముండవచ్చునని సంతోషము తుదకు వ్యసనమగునని యున్నది. కనుక ఇహలోక సంతోషము, నవ్వు హృదయమును సంతోషింపచేయలేవు. ఇహలోక, శరీర సంతోషములు లోపించినను ఆత్మలో సంతోషించిన హృదయము సంతోషముగా ఉండును. దయగల మాటలు హృదయమును సంతోషపెట్టును (సామె12:25) దయగల మాటలు ఆత్మసంబంధమైనవి గనుక ఇహలోక సంబంధమైన సంతోషము ద్వారా మేలేమి లేదని గ్రహించెను. 3వ. దేహమును ద్రాక్షారసము చేత సంతోషపరచ వచ్చునేమోయని, మత్తు కలిగించు,మతిహీనత ద్వారా నిజమైన హృదయ సంతోషము కలుగునేమో అని ప్రయత్నించెను. హృదయ సంతోషమునకై ద్రాక్షాతోటలు నాటించెను (2:11).

**4-6 వ. ఇహలోకపు ఆస్తులు - విలాసములు :**

4-6 వ. సొలొమోనుకు 1000 మంది భార్యలు. వారి కొరకు, తన కొరకు గొప్ప ఇండ్లు కట్టించాడు. దేహ సంతోషమునకై ద్రాక్షాతోటలు, సకల విధములైన వృక్షఫలములు నాటించాడు. వాటికి నీరు పెట్టుటకై చెరువులు త్రవ్వించాడు. శృంగార వనములు వేయించాడు. శృంగారము అనగా లైంగిక సంబంధమైనది అని భావము.

సొలొమోనుకు 700 మంది భార్యలు, 300 మంది ఉపపత్నులు కలరు (1రా 11:3). కామాతురతగలవాడు (1రా 11:2) గనుక శృంగారము కొరకు వనములను వేయించి శృంగారము ద్వారా హృదయమునకు సంతోషము కలుగునేమో అని ప్రయత్నించెను (ప్రసంగి 1:8) కాని గొప్ప ఇండ్లు, గొప్ప తోటలు, శృంగారము అనగా కామము ద్వారా హృదయ సంతోషము కలుగదని చెప్పుచున్నాడు (2:10-11).

**7-9 వ. సంపదలు - సంపాదనలు :**

7-9 వ. పనివారిని, పనికత్తెలను, గొప్పమేకల మందలను, వెండి, బంగారు, ఆయా దేశములందలి సకల సంపదలు, గాయకులు, గాయకురాండ్రు, బహుమంది ఉపపత్ను లను సంపాదించాడు. వీటన్నిటి ద్వారా లోకములో ఘనుడై అభివృది గలవాడయ్యాడు. వీటన్నిటితో శరీరాన్ని, హృదయాన్ని సంతోషపెట్ట ప్రయత్నించాడు కాని సూర్యుని క్రింద వీటన్నిటి ద్వారా హృదయమునకు సంతోషము కలుగదని అనుభవము ద్వారా గ్రహించాడు.

**10-11 వ. నేత్రాశలు - శరీరాశలు :**

10-11 వ. కన్నులు చూచి ఆశించిన వాటినన్నింటిని శరీరముతో అనుభవించాడు. హృదయము కోరుకున్న ప్రతిదానిని నిర్బంధించక అనుభవించాడు. ఆ అనుభవమే తనకు లభించిన భాగ్యము అంటున్నాడు. కాని ఈ అనుభవమునకై తాను పడిన ప్రయాస అంతా గాలికై ఒకడు పడిన ప్రయాసగా ఉన్నదేగాని హృదయమునకు క్షేమకరమైన దేదియు సూర్యుని క్రింద లేదని వివేచన ద్వారా గ్రహించాడు.

**12-14 వ. జ్ఞానులు - బుద్ధిహీనులు మృతిపొంది మరువబడుట ఒకటే గనుక జ్ఞాన సంపాదన వ్యర్థము :**

12-14 వ. రాజు తరువాత రాబోవు వాడు జ్ఞానముగా ప్రవర్తించి ముందు జరిగినవి కాపాడునో, లేదా బుద్ధిహీనుడై పాడు చేయునోయని పరిశీలించగోరెను. జ్ఞానికి కన్నులు తలలో ఉన్నవి, కాని బుద్ధిహీనుడు చీకటిలో నడచును గనుక కనుగొనలేదు. కావున చీకటి కంటే వెలుగు ప్రయోజనకరమైనట్లు బుద్ధిహీనతకంటే జ్ఞానము ప్రయోజనకరము కాని జ్ఞానికి, బుద్ధిహీనునికి ఒక్కటే గతి సంభవించును.

**15-17 వ. ఫలితము :**

15-17 వ. బుద్ధిహీనులు మరణించినట్లే జ్ఞానులు మరణింతురు. బుద్ధిహీనులు మరువబడినట్లే జ్ఞానులు తమ తరువాతి దినములలో మరువబడుదురు గనుక కష్టపడి జ్ఞానము సంపాదించినను సూర్యుని క్రింద దానివలన లాభమేమి లేనందున గ్రంథకర్త జ్ఞానము సంపాదించినందుకు మథన పడుచు జ్ఞాన సంపాదన వ్యర్థమని ఫలితార్థము చెప్పుచున్నాడు.

**18-20వ. 21-23 వ. ప్రయాసపడి సంపాదించిన కష్ట ఫలము తరువాత ఉండబోవువారు కాపాడు దురన్న నిరీక్షణ లేనందున సమస్త సంపాదన వ్యర్థము :**

సూర్యుని క్రింద ఒకడు తన సంపాదన అంతా తరువాత తరము వారికి విడవాలి. కాని వారు వాటిని ప్రయాసపడి కాపాడుదురన్న నిరీక్షణలేదు. అందువలన సూర్యుని క్రింద సంపాదనయు వ్యర్థమే. ప్రస 2:12-23 లో చెప్పినట్లు సొలొమోను తరువాత రెహబాము రాజై 17సం॥ పాలించాడు. రెహబాము యెహోవా యందు భయభక్తులు లేనివాడై అవివేకముగా ప్రవర్తింపగా 12 గోత్రముల వారు వేరైపోయిరి. విగ్రహారాధికులైరి. యెహోవా దృష్టికి చెడునడత నడిచిరి. ఆ పదిగోత్రములవారు ఇశ్రాయేలువారు అని పిలువబడిరి. మిగిలిన రెండు (యూదా, బెన్యామీను) గోత్రములవారు సొలొమోను సంతతియగు యూదావారు అని పిలువబడిరి. వారికి వీరికి ఎల్లప్పుడు యుద్ధములు కలుగుచుండెను. కనుక సొలొమోను సంపాదించినది యావత్తు తన తరువాత రెహబాముకు అప్పగించగా, రెహబాము అవిధేయత, అవివేకమువలన యావత్తు నష్టపరచబడెను.

**24-26 వ. ఫలితము :**

24-26 వ. రెండవ అధ్యాయమంతటిలో అనుభవించుట ద్వారాను, పరిశీలన ద్వారాను ఎరిగిన ఫలితమును తెలుపుచున్నాడు. కష్టార్జితము చేత అన్నపానములు పుచ్చుకొని సుఖపడుటకు, ఆనందించుటకు దేవుడు తన దృష్టికి మంచివారికి (దేవుని యందు భయభక్తులు కలవారికి) అనుగ్రహించును. యాకో 1:17 లో శ్రేష్ఠమైన ప్రతి ఈవియు సంపూర్ణమైన ప్రతివరమును పరసంబంధమైనదై జ్యోతిర్మయుడగు తండ్రి యొద్ద నుండి వచ్చునని చెప్పబడినది. ఈ గ్రంధకర్త తండ్రియైన దావీదు కీర్తన 37:37 లో యధార్థవంతులను చూడుము... వారిసంతతి నిలుచును. ఒకడైనను నిలువ కుండ భక్తిహీనులసంతతి నిర్మూలమగును అన్నాడు. కనుక దేవునియందలి భయభక్తులే సదాశ్రేయస్కరములు.

## 3 అధ్యాయము

8 + 7 + 7 = 22

అంశము : వ్యర్థమైన జీవితకాల ప్రయాసలు-దేవుని యందలి భయభక్తులే శ్రేష్టము.

**1-8 : జీవితకాల వ్యర్థమైన ప్రయాసలు :**

1 వ. మానవజీవిత మంతటిలోని పనులు ప్రయాసలు ఈ భాగమందు 14 జంటలుగా చెప్పబడినవి. ఒక్కొక్క జంటలోని రెండు పదములు ఒక దానికొకటి

వ్యతిరేకముగా ఉన్నవి. 14 జంటలుగా చెప్పబడిన 28 కార్యములు ప్రయాసతోను కూడినవి. కనుక సూర్యుని క్రింద ప్రయాస వలన లాభమేమియు లేదని చెప్పుచున్నాడు. ఈ 28 ప్రయాసలలో కొన్నిటిని ఆత్మీయముగా ఆలోచిద్దాము.

2 వ. : (ఎ) పుట్టుట – చచ్చుట. తమకాలము ఎప్పుడు వచ్చునో నరులు ఎరుగరు (ప్రస. 9:12). మనుష్యులు దానిని అశుభకాలమందురు. కనుక లాభములేదు. ఈ లోకపు సూర్యునిక్రింద అశుభమే కాని నీతి సూర్యుడైన యేసు క్రింద జీవితమును ప్రస్తావించుచూ పౌలు నామట్టుకు బ్రతుకుట క్రీస్తే. చావైతే లాభము (ఫిలి. 1:21) అన్నాడు. ఈ లోకపు సూర్యుని క్రింద జీవితము కంటే నీతి సూర్యుడైన యేసు క్రింద జీవితమును కొనసాగించాలని దీని భావము.

(బి) నాటుట. పెరికివేయుట : ఇది సాధారణంగా రైతులు చేయుపని. చాలా మంది రైతులు లాభములేదని చెప్పుట, అప్పులపాలై ఆత్మహత్యలు చేసికొనుట చూస్తున్నాము. ప్రభువు నందు నాటు పరిచర్య ఎల్లపుడు లాభకరమైనది. 1 కొ. 3:6లో నేను నాటితిని... వృద్ధికలుగ జేసినవాడు దేవుడే. 1 కొ. 3:13 – 16 లో యుగసమాప్తిలో పైరుకొయబడిన దినమున ప్రతి ఫలముగా బహుమానమున్నదని చెప్పబడినది. కనుక ప్రభువునందు నాటుట ప్రయోజనమే.

3వ. (సి) గాయపరచుట (చంపుట) – బాగు చేయుట : యుద్ధములలో శత్రువులను గాయపరచుట శత్రువులు గాయపరచిన వారిని బాగుచేయుట జరుగుచుండును. ఒకే రాజ్యంలో అంతర్యుద్ధములు జరిగినపుడు కూడా అలాగేజరుగును. యుద్ధములో జనాభాతగ్గుట, దేశనాగరికత దెబ్బతినుట, జరుగుచుండును. ఆత్మీయముగా ఆయన గాయము చేయును, ఆయన చేతులే స్వస్థపరచును (యోబు 5:18). అంటున్నాడు. ప్రభువు చేయు గాయము ప్రేమతో వైద్యుడు ఆపరేషన్ చేయునట్లు చేయును. శత్రువువలె నశింపజేయుటకు కాదు. ఆపరేషన్‌లో గాయముచేసిన వైద్యుడు గాయమును కట్టిబాగు చేసినట్లు దేవుడు బాగు చేయును. ఆత్మీయజీవితములో మనలను ప్రేమించు దేవుడు యోబును గాయపరచి స్వస్థపరచినట్లు మనలను కూడా స్వస్థపరచును.

(డి) పడగొట్టుట – కట్టుట (4–5వ) రాళ్ళుపారవేయుట – కుప్పలు వేయుట : అనేక కట్టడములు కట్టబడి కొంతకాలము తర్వాత పడగొట్టబడుచున్నవి. అవి మరల కట్టబడును. కట్టుటకు, పడగొట్టుటకు అనేక కంపెనీలు కలవు. ఇది లోకములో జరుగు నిత్యవిధి. ఆత్మీయజీవితములో సమస్తమును కట్టినవాడు దేవుడు (హెబ్రీ 3:3) అంటున్నాడు. దేవుడు కట్టిన ఆలయమును (పడగొట్టకూడదు) పాడుచేయకూడదని 1 కొ. 3:17 లో చెప్పబడినది. కాని లోకములో దేవుని పనిని పాడు చేయువారున్నారు. మనము ఆలాగు ఉండకూడదు.

(ఇ) 4–5వ. నవ్వుట – నాట్యమాడుట – కౌగలించుట వంటివి చెప్పబడ్డాయి – ఇవి జీవిత నిత్యకృత్యములే.

(ఎఫ్) 7వ. మాటలాడుట – మౌనముగా ఉండుట – మానవుని జీవితంలో మాటలాడుట మౌనముగా ఉండుట సాధారణవిషయము. అలాగే ఆత్మీయులు దేవుడు మాటలాడమన్నపుడు మాటలాడాలి. మౌనముగా ఉండమన్నపుడు మౌనముగా నుండాలి. ప్రభువు కూడా పిలాతుముందు మౌనముగా ఉండెను. మాటలాడవలసినపుడు మాటలాడెను (మత్త 27:13).

(జి) 8వ. ప్రేమించుట – ద్వేషించుట : జీవితములో ఇవి సహజమే. ఆది. 30–31లో యాకోబు రాహేలును ప్రేమించాడు. లేయాను ద్వేషించాడని ఉంది. ప్రభువు తనవారిని ప్రేమించాడు. అంతము వరకు ప్రేమించాడని యోహా 13:1 లో ఉంది. అలాగే నిన్నువలె నీ పొరుగు వారిని ప్రేమించమని లూకా 10:27 లోఉన్నది. కనుక ఆత్మీయులు ఒకరినొకరు ప్రేమించాలిగాని ద్వేషించకూడదు.

(హెచ్) 8వ. యుద్ధము చేయుట – సమాధానపడుట : ఎఫెసీ 6:12 ప్రకారము మనము శరీరులతో (మనుష్యులతో) పోరాడరాదు. నిత్యము మనకు, సాతానుతో వానిదూతలతో పోరాటమున్నది. ఆత్మ ఖడ్గము ధరించి జయించువారముగా ఉండాలి. మరికొన్ని ప్రసంగి 3:1–8 వచనములలో కలవు.

**9–15 ఫలితము :** సంతోషముగాను, సుఖముగాను బ్రదుకు వెళ్ళబుచ్చుట దేవుని యందు మానవులు భయభక్తులు గలవారికి అది అనుగ్రహించబడును. దేవుని యందు మానవులు భయభక్తులు కలిగి యుండుటకే దేవుడు ఇట్టి నియమమును చేసియున్నాడని చెప్పుచున్నాడు.

**16 – 22 వ. నీతిమంతులకు దుర్మార్గులకు తీర్పు తీర్చువాడు దేవుడే :**

16–22 వ. సూర్యుని క్రింద న్యాయము ఉండవలసిన చోట దుర్మార్గత ఉన్నది. కాని మానవుని ప్రతి చర్యకు యుక్తకాలములో దేవుని చేత న్యాయమైన తీర్పుతీర్చబడును. సూర్యుని క్రింద మానవుల ప్రవర్తన మృగముల వంటిదిగా నున్నది. మృగములు ఏరీతిగా ఇతర మృగముల పట్ల అన్యాయముగా ప్రవర్తించునో మానవుల మధ్య అట్లే జరుగుచున్నది. కనుక చచ్చుటలో మానవులు సూర్యుని క్రింద మృగముల వంటి వారేనని తీర్మానించు చున్నాడు. మానవుల జ్ఞానముతో నరుల ఆత్మ పరమునకు పోవునో లేదో ఎరుగలేము. తమకాలము తరువాత ఏమిజరుగునో నరులకు తెలియదు. కనుక సూర్యుని క్రింద జీవితములో సంతోషించుటకంటే మేలేమి లేదని చెప్పుచున్నాడు.

## 4 వఅధ్యాయము

3 + 3 + 3 + 3 + 4 = 16వ

అంశము : సహవాస జీవిత అన్యాయాలు – అసమానాలు

1–6 వ. : సమాజములోని అన్యాయములు.

**1–3 వ. బలవంతులు దిక్కులేని వారిని బాధపెట్టుట – ఆదరించువారు లేకపోవుట :**

1 వ వచనములో యోచించితిని, 7వ వచనంలో ఆలోచించితిని అన్నందున ఈ అధ్యాయమందలి విషయములు ఆలోచించుటద్వారా కనుగొన్న ఫలితములు తెలుపుచున్నాడు. సమాజంలో బలవంతులైన వారు బాధించుట, బాధపడువారు కన్నీరు కార్చుట, ఆదరించువారు లేక పోవుట సూర్యుని క్రిందజరుగుచున్న అన్యాయములు. కనుక ఈ దినముల కంటే ముందుగా చనిపోయిన వారు, ఇంకను పుట్టని వారు ధన్యులని ప్రసంగి కనుగొన్నాడు.

దైవికముగా (ఆత్మీయముగా) ఆలోచించిన దేవుడే ఆదరణ కర్త. ఈ లోకమునకు పంపిన పరిశుద్ధాత్మ కూడా ఆదరణకర్త (యోహాను 14:16, 26, 15:26). కనుక రక్షింపబడినవారు తమను ఆదరించుకర్తను కలిగియున్నారు. యెషయా 63:5 ప్రకారము దేవుని బాహువైన యేసు కూడా ఆదరణకర్తయే.

యెష 63:5 లో ఆదరించువాడు లేకపోయెను. కావున నా బాహువు నాకు సహాయము చేసెను అంటున్నాడు. లోకములో అనగా సూర్యుని క్రింద ఆదరించువారు లేరు. ఆదరణలేదు. అందకు దేవుడు బాహువును ధరించి అనగా హెబ్రీ 10 :4 ప్రకారము శరీరమును ధరించి లోకమునకు యేసు క్రీసు అను పేరుతో 2000సం॥ క్రిందట వచ్చాడు. పాప పరిహారానికై ప్రాణము పెట్టుట ద్వారా మానవులకు ఆదరణ నిచ్చాడు. చనిపోయి, పాతిపెట్టబడి, తిరిగి లేచి ఆరోహణుడై వెళ్ళి మానవుల మధ్య సదాకాలము ఉండునట్లు ఆదరణ కర్తయైన పరిశుద్ధాత్మను పంపించాడు. కనుక దేవుని యందు భయభక్తులు లేనివారికి ఆదరణ సూర్యుని క్రింద లేదు కాని దేవుని యందు భయభక్తులు గలవారిని తండ్రి, నీతి సూర్యుడైన కుమారుడు, పరిశుద్ధాత్మదేవుడు నిత్యము ఆదరించు చుందురు.

**4–6 వ. కష్టపడి నేర్పుతో చేయుపనులలోని రోషమును వ్యర్థము :**

సూర్యుని క్రింద జీవితములో నేర్పుతో పనిచేయువారు, కష్టపడి పనిచేయువారు తమ పొరుగువారి యెడల రోషము కలిగి యుందురు. తమ కంటే పైనున్న వారి యెడల పౌరుషము కలిగి తగిన సమయమందు వారితో పోరాడువరకు వెళ్ళుదురు. అనేకులు ఈ పోరాటములో తాము పదవీ విరమణచేయు వరకు జయమును పొందలేరు. కనుక

తమ నేర్పరితనము తాము పడిన కష్టము వ్యర్థమై పోయెనని గ్రహించుదురు. బుద్ధిహీనుడు అంతగా కష్టపడడు. కాని తన చేతుల కష్టార్జితమును భుజించును. కనుక రెండు చేతులతో కష్టపడి నెమ్మది లేక యుండుట కంటే ఒక చేతి నిండ నెమ్మది కలిగి యుండుట మేలు. ఇహలోకపు సూర్యుని క్రింద నెమ్మది లేదు గాని పరలోకపు సూర్యుడైన ప్రభువు క్రింద నెమ్మది కలదు. ప్రభువు పనికై పడు ప్రయాస వ్యర్థము కాదని తెలిసికొనవలెను.

2 రా. 5:1-19 లో నయమాను సిరియదేశానికి సైన్యాధిపతి అను నయమాను పేరుకు మనోహరము అని అర్థము. అయనను తనకున్నకుష్ఠ రోగమును బట్టి నెమ్మదిలేక యుండెను. ప్రవక్తయైన ఎలీషా దగ్గరకు వచ్చి విధేయత చూపుట వలన శరీరము మనోహరముగా మార్చబడి నెమ్మది దొరికెను. ఎలీషా అనగా రక్షించు దేవుడు అని అర్థము లోకములో కలిగిన ఆస్తి, ప్రఖ్యాతి, గొప్పతనములు నెమ్మదినివ్వలేవు. రక్షించుదేవుడైన యేసు నొద్దకు వచ్చినవారు, యేసు మాటకు విధేయత చూపువారు, ప్రభువుసేవలో ప్రయాసపడువారు నెమ్మదిని కలిగి యుందురు.

రూతు గ్రంథముందు నయోమి బేత్లెహేమును విడిచి మోయాబుకు వెళ్ళి నెమ్మదిని కోల్పోయింది. నయోమి అను పేరుకు మధురము అని అర్థము. కాని ఆమె నన్ను మారా అనగా చేదు అనండి అంటున్నది (రూతు 1:20) బేత్లెహేము విడిచి మోయాబుకు వెళ్ళుట దేవుని సహవాసమునకు దూరమగుటయే. అందుకే ఆమె నెమ్మదిని కోల్పోయినది. ఆమె మరల బేత్లెహేమునకు వెళ్ళుటద్వారా నెమ్మదిని పొందినది. రూతును బోయజు వివాహమాడెను. వారికి ఓబేదు పుట్టుట తదుపరి ఆ కుటుంబము మనోహరమైన జీవితము జీవించి, నెమ్మదిని కలిగియుండుట చూడగలము.

### 7-12 వ. సహవాసజీవితము :

7-8 వ. లో ఒంటరిగా నున్న ఒకని గురించి చెప్పబడినది. నరుడు ఒంటరిగా ఉండుట మంచిది కాదని దేవుడు నరునికి సాటియైన సహాయమును చేశాడు (ఆది 2:18-24). కనుక ఒంటరిగా కాక జంటగా నుండుట దేవుని చిత్తము. నోవహు కాలమందు ఓడలో ప్రవేశించిన వారిలో, నోవహు ఆయన జతయైన భార్య, ముగ్గురు కుమారులు వారిజతలగు భార్యలను చూడగలము. అలాగే జంతువులు, పక్షులు, ప్రాకుపురుగులు అన్నియు జతలు, జతలుగా ఓడలో ప్రవేశించెనని చూడగలము (ఆది. 7:7-9).

9 వ. కనుక ఒంటరిగా ఉన్నాడు, కుమారుడు సహోదరుడు లేడనుటలో కుటుంబమును గూర్చి మాటలాడు చున్నాడని తలంచగలము. ఒంటరిగా ఉన్న వానికి తన ఐశ్వర్యము గాని, తన ప్రయాస గాని తృప్తినివ్వదు. ఒంటరి ప్రయాస అంతయు వ్యర్థము. తనకెవరు లేరు గనుక ప్రయాసపడి సంపాదించిన యావత్తు వ్యర్థము. కనుక ఒంటరిగా నుండక జంటగా ఉండుట ఉభయులకు క్షేమము.

10 వ. ఒంటరిగానున్నవాడు క్రింద పడి లేవ లేక శ్రమ కలిగి ఉండను. జతగా ఉన్నపుడు ఒకడు పడిపోయినను జతగానున్నవాడు లేపును. ఇద్దరు కలసి కష్టపడుట వలన ఉభయులకు మంచి ఫలము కలుగును.

11 వ. పురుషునికి జత లేదా సాటియైన సహాయము స్త్రీయే. (ఆది 2:18) ఇద్దరును కలిసి పండు కొనినపుడు వారికి వెట్టకలుగుట భార్య భర్తలను గురించిన భాగము. భార్యాభర్తలకు ఒకరి ద్వారా ఒకరికి వెట్టకలుగును. సహవాసము, సాంగత్యము, సంసార వ్యవస్థను గూర్చి తెలుపుచున్నాడు. శత్రువును ఎదుర్కొనుటకు ఒంటరివానిచేతగాదు. కాని జతగా నున్నపుడు శత్రువును ఎదిరించగలరు.

12 వ. మూడు పేటలత్రాడు తెగదు. దైవ నియమములో తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ కలదు. మానవనిర్మాణమందు శరీర, ప్రాణ, ఆత్మలు కలవు. దేవుని స్తుతించుటలోను పరిశుద్ధుడని ముమ్మారు మహాదూతలు పలుకు చున్నారు (యెషయా 6:3) ఇవన్నీ మూడు పేటలు బలమైనది అనుటకు సూచన.

### 13-16 వ. ఉద్యోగములలోని అన్యాయములు :

13-16 వ. రాజకీయంలో గాని, ఉద్యోగాలలో గాని, మూఢమైన ముసలి వారి కంటే బీదవాడు, చిన్నవాడు చెరలోనున్న జ్ఞాన వంతుడే శ్రేష్ఠుడు. బీదవాడుగా పుట్టి చెరకు వెళ్ళినను జ్ఞానము కలిగియుండిన యెడల పట్టాభిషేక సమయమునకు చెరనుండి బయటకు వచ్చి సింహాసనాసీనుడగును. తన జ్ఞానము చేత జనులనందరిని, పదవీచ్యుతుడైన మూఢుడైన ముసలి రాజు పక్షమునున్న వారిని తన వైపుకు మళ్ళించుకొనును. ఇంతవరకు సరిపోయినది. కానీ ఈయన తరువాత రాబోవు మూడవ రాజుగాని, ఆనాటి ప్రజలుగాని జ్ఞానియగు రెండవ రాజునందు ఇష్టపడురు. కనుక రాజరికము, పదవులు వ్యర్థములేనని సెలవిచ్చుచున్నాడు.

సొలొమోను రాజు ముసలివాడు కాగా మూఢుడైబహు మందిభార్యలద్వారా విగ్రహా రాధనకు త్రిప్పబడి యెహోవా రెండు మారులు హెచ్చరించినను దేవుని బుద్ధి మాటలకు చెవి యొగ్గ లేదు (1 రాజు 11:1-10). అదే దేశమందు యరోబాము ఒక విధవరాలికి జన్మించెను. యరోబాము జ్ఞానము కలవాడని సోలోమోను గుర్తించి అధిపతిగా నియమించెను. కాని యరోబాము తిరుగుబాటు చేసి ఐగుప్తునకు పారి పోయెను. ప్రవక్త అయన అహీయా ప్రవచించినట్లు సొలొమోను మరణించిన తరవాత ఇశ్రాయేలు పది గోత్రముల వారికి ఇతను రాజై వారిని విగ్రహారాధికులుగా చేసెను. (1 రాజు 11:26-40). ప్రసంగి 4:16 లో నున్నట్లు జనులు యరోబామునందు ఇష్టపడలేదు. యరోబాము ప్రవర్తన ద్వారా ఇశ్రాయేలీయులు శిక్షకు పాత్రులైరి. నిజముగా జనులందరు

ఇష్టపడునటువంటి పరిపాలన యేసుక్రీస్తు యొక్క వేయి ఏండ్ల పాలనలోనే ఉండును. కనుక ఈ లోక రాజ్య ప్రయాసలన్ని ఒకడు గాలికై ప్రయాస పడినట్లేయని ప్రసంగి 4:16 లో చెప్పుచున్నాడు.

## 5 అధ్యాయము

7 + 5 + 5 + 3 = 20వ

అంశము : వ్యర్థమైన జీవితకాలధన ధాన్య సమృద్ధి

**1-7 వ. దేవుని మందిరమునకు పోవునపుడు ప్రవర్తన - దేవునియందు భయభక్తులు కలిగి బలి అర్పించుట - స్తుతి ఆరాధనలోని వ్యర్థతలు :**

దేవుని మందిరములో ప్రవేశించుట (1వ) - పలుకుట (2, 3వ) - మ్రొక్కు బడి చేసికొని చెల్లింపకుండుట (4వ) మ్రొక్కుబడి చెల్లించుట (5వ) పొరపడి దేహమును శిక్షకు లోబరచుట అను అంశములు ఈ భాగమందున్నందున ఈ భాగములో ఆరాధించుట ప్రాముఖ్య అంశము.

1-2 వ. ఇందులో బుద్ధిమంతులు, బుద్ధిహీనులు ఆరాధించు విధములో తారతమ్యములు చూచుచున్నాము. బుద్ధిమంతులు అనాలోచనగా పలుకక సమీపించి వినుచుందురు. ఇదియే సరియైన అరాధన. సమీపించి వినుట అనగా కేవలము చెవులతో వినుటకాదు. సంగతులు అర్థము చేసికొని దాని ప్రకారము ప్రవర్తించుట అని అర్థము. బుద్ధిమంతులు వాక్యములో వ్రాయబడిన రీతిగా క్రమమైన ఆరాధన జరిగించుదురు. (1 సమూ. 15:22, యిర్మీ. 7:21 - 24, సామె. 21:3) 1 సము. 15:22 దేవుని ఆజ్ఞల గైకొనుట దేవుని మాటలకు విధేయత చూపుట బలులు అర్పించుట కంటే శ్రేష్టము అనిచెప్పబడినది. కనుక ఆరాధించుట కంటే ముందుగా మన జీవితములను పరీక్షించుకోవాలి. దేవుని ఆజ్ఞలు గైకొనుటలో లోపములు ఎవైనా ఉన్నయెడల ముందుగా చక్కచేసికొవాలి. యిర్మీ. 7:21-24లో యూదావారికి దేవుని ఆజ్ఞల ప్రకారము నడచుట బలి అర్పించుటకంటే ప్రాముఖ్యమని చెప్పుచున్నాడు. సామె. 21:3లో నీతిన్యాయములు అనుసరించి నడచుకొనుట, బలులు అర్పించుటకంటే యెహోవాకు ఇష్టము అని వ్రాయబడినది. కనుక అనాలోచనగా దేవుని సన్నిధిలో ప్రవేశింపకూడదని 2వ వచనములో చెప్పబడినది. 6వ వచనంలో దేహమును శిక్షకు లోబరచునంతపని జరగనియ్యకుము అని వ్రాయబడినది. 1 కొరి. 11:27-31 లో ఆరాధనలో భాగములైన రొట్టె, రసములలో అయోగ్యముగా పాలు పొందక ప్రతి మనుష్యుడు తన్నుతాను పరీక్షించు కొనవలెనని చెప్పబడినది. వివేచింపక తిని త్రాగువారు ముందు బలహీనులు తరువాత రోగులు అగుదురు. చివరకు నిద్రించుట అనగా ప్రభువునందు నిద్రించుట (మరణము)

పాపమునకు శిక్షగా కలుగును. మనలను మనము విమర్శించు కొనినయెడల తీర్పుపొందక పోదుము అని చెప్పబడినది.

3 వ. పెక్కుమాటలు పలుకు వారు బుద్ధిహీనులగుదురని వ్రాయబడినది. కనుక దేవుని సన్నిధిలో అనాలోచనగా పలుకకూడదని, పెక్కుమాటలు పలుక కూడదని వ్రాయబడినది.

4-5వ. మ్రొక్కుబడి చేసికొనుట, మ్రొక్కుకొనిన దానిని చెల్లింపకుండట ప్రతివ్యక్తి జీవితములో జరుగు సంభవములే. యోనా. 2:9లో నేను మ్రొక్కుకొనిన మ్రొక్కుబళ్ళను చెల్లింపక మానను అని అన్నాడు. దేవుని పిల్లలు మ్రొక్కుబడి చేసికొని కొన్ని పర్యాయములు మరతురు. ప్రియపాఠకా, మీరు మీ మ్రొక్కుబళ్ళను మరచినారేమో పరీక్షించుకొనుట ఆవశ్యము. ఒక వేళ మరచిఉంటే యోనావలె చెల్లింతునని వాగ్దానము చేయాలి. ఆలాగు చేయని యెడల 6వ వచనములోనున్నట్లు దేవునికి కోపము కలుగుట, మన కష్టమంతయు వ్యర్థమగుట జరుగును. కనుక దేవుని యందలి భయభక్తులే శ్రేష్ఠమని చెప్పుచున్నాడు.

### 8-12 వ. ధన ధాన్య సమృద్ధి వ్యర్థము :

బీదలు (8వ), ఐశ్వర్యవంతులు (12వ) ధన సమృద్ధినపేక్షించువారు (10వ) ఆస్తి ఎక్కువగుట (11వ) అనుపదములు ఈ భాగమందు కలవు.

లోకములో అధికారులు, వారిపై అధికారముగలవారు, మరి ఎక్కువ అధికారము నొందిన వారు కలరు. వీరు బీదలను బాధించుదురు ధర్మమును, న్యాయమును మీరుదురు సుఖించలేరు. ధనవంతులు ధనాన్నిచూచు కోవడమేగాని సుఖించలేరు. వారికి నిద్ర పట్టదు (12వ) కష్టజీవులు కొద్దిగా తినినను సుఖ నిద్ర నొందుదురు. ద్రవ్యమునపేక్షించువారు దానిచేత తృప్తినొందలేరు. ఆస్తిని భక్షించువారు తోడై దానిని భక్షించుదురు. కనుక ధన సమృద్ధినపేక్షించుట వ్యర్థము. లోకములో అందరికి పైనున్న అధికారియగు రాజు భూమి విషయమై శ్రద్ధ పుచ్చుకొనిన యెడల భూమి బాగుగా పండును. ప్రజలందరు క్షేమముగా ఉందురు. కనుక అది అన్ని విషయములలో మేలు అని 9వ. లో చెప్పుచున్నాడు.

### 13-17 వ. ఆస్తిసంపాదనలు వ్యర్థము :

13-17 ఆస్తిగలవారు దాని దాచి పెట్టుటలో విఫలులై తమకే నాశనము తెచ్చుకొందురు. కొన్నిసార్లు వారి ఆస్తి దురదృష్టము వలన నశించిపోవును. ఒకడు తల్లి గర్భములో నుండి ఏలాగు వచ్చెనో ఆ ప్రకారముగానే అనగా దిగంబరి గానే వెళ్ళాలి. తన సంపాద్యములో ఏమియు తీసుకొనిపోలేరు.

కనుక ప్రయాసపడి సంపాదించిన అంతటివలన లాభమేమియులేదు. గాలికై ప్రయాసపడినట్లే అని చెప్పుచున్నాడు.

**18-20 : ఫలితము :**

దేవుడు నియమించిన ఆయుష్కాల దినములన్నియు అన్నపానములు పుచ్చుకొనుచు, తన కష్టార్జితమును, దేవుడిచ్చిన ధనధాన్య సమృద్ధిలో తన భాగమును అనుభవించుటకు వీలుకలిగినయెడల అట్టిస్థితి దేవుడే అనుగ్రహించెనని తెలుసుకొనవలెను.

## 6వ అధ్యాయము

3 + 3 + 3 + 3 = 12వ

అంశము : వ్యర్థమైన మానవుని ఘనత - అంత్యకాలస్థితి

సూర్యుని క్రింద జీవితకాల వ్యర్థతలు 6వ అధ్యాయముతో ముగించబడుచున్నవి. ఈ చివరి అధ్యాయములోను వ్యర్థతలను గూర్చి, దురవస్థలను గూర్చియే మాటలాడు చున్నాడు. సూర్యుని క్రింద జీవితము వ్యర్థతతోను, దురవస్థతతోను కూడినదని చెప్పుచున్నాడు. ఈ అధ్యాయాన్ని కొన్ని ప్రశ్నలతో ముగిస్తున్నాడు. (1) జీవితకాలమునకు ఏదిక్షేమకరమైనదో ఎవరికి తెలియును ? (2) ఒకడు పోయిన తరువాత ఏమి సంభవించునో ఎవరు చెప్పగలరు ? వీటిభావము ఏమంటే జీవితమంతా దురవస్థలతో కూడినది, ఎప్పుడు ఏమి జరుగునో చెప్పజాలము. అందుకే సమస్తము వ్యర్థమని సారాంశముగా మరొకసారి చెప్పుచున్నాడు.

అయితే ఒక సంగతి! ఇహలోక సూర్యుని క్రింద సమస్త ప్రయాస వ్యర్థమే. కాని పరలోకపు సూర్యుడగు దేవుని (యేసుక్రీస్తు) క్రింద సమస్త ప్రయాస ప్రయోజనకరమైనదే కాని వ్యర్థముకాదు. కనుక దేవుని యందు భయభక్తులు కలిగియుండుటయే మానవకోటికి విధి అని మనము గమనించాలి.

**1-3 : ధన, ధాన్య, సంతాన సమృద్ధి, దీర్ఘాయువు, ఘనతకలిగి సుఖమెరుగక, సరియైనరీతిగా సమాధి చేయబడక యుండుటకంటే పడిపోయిన పిండము గతిమేలు :**

దేవుని అనుగ్రహము వలన ధన ధాన్య సమృద్ధి ఘనతలు కలుగును. సంతానా భివృద్ధియు దేవుని వలననే కలుగును. కాని వీటన్నిటిని అనుభవించుటయు దేవుని వలననే కలుగును. కాని అలాగు అనుభవించుటకు దేవుడు శక్తినివ్వనందున, అనుభవింప వీలుకానివారున్నారు. అటువంటి దురవస్థ కంటే తల్లిగర్భములోనుండి పడిపోయిన పిండము గతి మేలు అంటున్నాడు. కనుక సమస్తమును అనుభవించుటకు వీలుకలుగ జేయువాడు దేవుడే. కనుక దేవుని యందు భయభక్తులు కలిగియుండుటయే మానవకోటికి విధి.

**4-6 వ. రెండు వేల సంవత్సరములు జీవించినను మేలు కానకుండిన జీవితము వ్యర్థమే :**

పై భాగములో చెప్పినట్లు మేలు అనుభవించుటకు దేవుని అనుగ్రహము లేనివ్యక్తి రెండు వేల సంవత్సరములు జీవించినను అతని జీవితము వ్యర్థమే. కనుక దేవుని యందలి భయభక్తులు బ్రదుకు కాలమంతయు కలిగి ఉండాలి.

**7-9 వ. బ్రతక నేర్చిన జ్ఞాని అడియాసలు కలిగి తిరుగులాడుట కంటే ఎదుట ఉన్నదానిని అనుభవించుటమేలు :**

7 వ. దేవుని ఎరుగని ప్రకృతి సంబంధమైన మనుష్యుడు కేవలము తన కొరకే ప్రయాసపడును. కాని తానెన్నడు మనస్సులో తృప్తి చెందలేదు.

8 వ. జ్ఞానము కలవారు అనగా దేవుని ఎరిగిన దేవుని పిల్లలు. బుద్ధిహీనులు అనగా దేవుని ఎరుగనివారు. బీదవారిలో బ్రదుక నేర్చినవారు కలరు. వారైనను దేవుని ఎరుగని యెడల వారికి ఏ విశేషము లేదు.

9 వ. కనుక దేవుని ఎరిగిన వారు అనేక ఆశలు కలిగి తిరుగులాడుట కన్న, దేవుని మార్గములందు నడచి దేవుడు ఇచ్చిన దానిని అనుభవించుటయే మేలు. ఇశ్రాయేలీయులు కనానులో ప్రవేశించునపుడు ద్వితీ. 4:5-6లో దేవుడు సెలవిచ్చిన సంగతిని గమనించగలము. దేవుడిచ్చిన ఆజ్ఞలను అనుసరించుట అన్యులు చూచి అదే జ్ఞానమని గుర్తింతురు. ఇశ్రాయేలీయులు జ్ఞానవివేకములు గల గొప్పజనమని చెప్పుకొందురు. కనుక దేవుని ఆజ్ఞలననుసరించి నడచుకొనుటయే శ్రేష్ఠమని ప్రసంగి చెప్పుట గమనించగలము.

**10-12 వ, 13-15వ. నీడవలె గతించు జీవితకాలములో ఏది క్షేమకరమో తెలియనందున జీవితకాలమంతయు వ్యర్థమే :**

దేవుడు మానవులకంటే బలవంతుడు, జ్ఞానవంతుడు. మేలుకలుగుటకై సమస్తము జరిగించుచున్నాడు అని రోమా. 8:28లో ఉన్నది. కనుక అట్టి దేవునితో వాదించుట వ్యర్థము. ఒక వేళ దేవునితో అనేక మాటలు వ్యాజ్యములుగా పలికినను అందులో నిరర్థకమైనవి అనేకములు ఉండగలవు. అందువలన దేవునితో వాదించక దేవునికి లోబడి దేవునియందు భయభక్తులు కలిగి జీవించుటయే శ్రేష్ఠము అను ఫలితమునకు నడిపించుచున్నాడు.

## 7వ అధ్యాయము

6 + 6 + 2 + 8 + 7 = 29వ

అంశము : జీవిత కాలమునకు మేలుకరమైన హెచ్చరికలు

మొదటి ఆరు అధ్యాయాలలో సూర్యుని క్రింద్ర జీవితకాలములోని వ్యర్థమైన వాటిని తెలిపి ముగించినను అంతటితో ఆపివేయక వ్యర్థమైన జీవితకాలమునకు కొన్ని హెచ్చరికలను 7–12 అధ్యాయాలలో చెప్పుచున్నాడు. 7వ అధ్యాయంలో సూర్యుని క్రింద జీవితానికి ఏవి మేలుకరములో చెప్పుచున్నాడు.

**1–6 వ. మేలైన వాటిని గూర్చిన హెచ్చరికలు :**

1 వ. సుగంధ తైలము కంటె మంచి పేరు మేలు. సుగంధతైలము ఎంతో విలువైనది. కాని దానిని సంపాదించుట కంటే మంచి పేరు సంపాదించుట మేలు. సూర్యుని క్రింద జీవితకాలములో మంచి పేరు అవసరమైనది. మంచిపేరు ఒకదినములో వచ్చునది కాదు, చెడ్డపేరు ఒకదినములోనే రాగలదు. ఒకని జన్మదినము కంటే మరణ దినము మేలు. జన్మదినమును గూర్చిన ఆలోచనలో ఏమేలు మనకు కలుగదు. కాని మరణమును గూర్చిన ఆలోచన మనసును ఖిన్న పరచును. ఆలోచించు వ్యక్తి దీనుడై తన మనసును దేవునివైపునకు త్రిప్పుకొనును.

2 వ. అలాగే విందు జరుగుచున్న ఇంటిలోకి వెళ్ళుటవలన శరీర సంతోషమేకాని ప్రలాపించువారి ఇంటిలోనికి వెళ్ళిన ప్రలాపములు ఎందుకు కలుగుచున్నవను ఆలోచన కలుగును. అలాంటి పరిస్థితి ఎందుకు కలిగినదో తెలిసికొని మనకు అలాంటి స్థితి కలుగకుండ కాపాడుకొనుటకు సహాయపడును.

3–4 వ. నవ్వుట కంటే దుఃఖపడుట మేలు. దైవచిత్తాను సారమైన దుఃఖము రక్షణార్థమైన మారుమనస్సును కలుగజేయును (2 కొరి. 7:10). మన దుఃఖ సమయములోనే అనగా శ్రమలలోనే దేవుని యొద్ద విలువైన పాఠములను నేర్చుకొందుము. హెబ్రీ 12:11లో ప్రస్తుతము సమస్త శిక్ష దుఃఖకరముగా కనబడునేగాని సంతోషకరముగా కనబడదు. అయినను దాని అభ్యాసము కలిగిన వారికి అది నీతి అను సమాధానకరమైన ఫలమునిచ్చును. హెబ్రీ 12:3–15 వరకు పూర్తిగా చదవండి. అలాగే 2 కొరి. 12:9–10లో బలహీనతయందు నాశక్తి పరిపూర్ణమగుచున్నదని ప్రభువు చెప్పిరి. కనుక బలహీనతలలోను, నిందలలోను, ఇబ్బందులలోను, హింసలలోను, ఉపద్రవములలోను నేను సంతోషించుచున్నానని పౌలు చెప్పెను. ఆత్మీయ ఎదుగుదలకు శ్రమలు, నిందలు, ఇబ్బందులు, హింసలు, ఉపద్రవములు, శిక్షలు అవసరమేనని గుర్తించాలి.

ఒక ఇనుపముక్కను కొంచెముసేపు అగ్నిలోకాల్చి కరిగించి సాగదీసి గుర్రపు నాడములను తయారు చేయుదురు. ఇంకా ఎక్కువ సేపు కాల్చి అనేకదెబ్బలు వేసి సన్నతీగలుగా సాగ గొట్టి స్ప్రింగులు చేయుదురు. ఈస్ప్రింగుల విలువ గుర్రపునాడముల విలువకంటే ఎక్కువ. కనుక ఆత్మీయులు ఎంతగా శ్రమలు, నిందలు, ఇబ్బందులు, హింసలు పొందుదురో అంతవిలువైన వ్యక్తులుగా తయారగుదురు. 1 పేతు. 2:18-22లో మేలు చేసి బాధపడునపుడు మీరు సహించిన అది హితము అని వ్రాయబడినది. 1 పేతు. 4:12లో అగ్నివంటి మహాశ్రమలు కలుగునని వ్రాయబడినది. 1 పేతు. 1:7లో మన విశ్వాసము అగ్నివంటి మహాశ్రమలకు నిలిచిన యెడల క్రీస్తు ప్రత్యక్షమైనపుడు మెప్పు, ఘనత, మహిమ కలుగునని చెప్పబడినది. కనుక మన క్షేమము కొరకే దుఃఖములను పంపునని గమనించాలి.

5-6 వ. బుద్ధిహీనుల పాటలు తాత్కాలిక ఆనందమును కలిగించును. కాని జ్ఞానుల గద్దింపులు మనస్థితిని గూర్చి ఆలోచించుకొనుటకు, జీవితమును చక్కపరచుటకు సహాయపడును. కనుక జ్ఞానుల గద్దింపులే శ్రేష్ఠము. బుద్ధిహీనుల నవ్వు వ్యర్థము.

**7-12 వ. అక్రమముల వలన కలుగు నష్టములు - జ్ఞానులవలన కలుగుమేలులు :**

7 వ. అన్యాయములు చేయుట, లంచము పుచ్చుకొనుట, అక్రమములు. వాటి వలన మనస్సు చెడును. జ్ఞానులు తమబుద్ధిని కోల్పోవుదురు.

8-10 వ. కార్యారంభము కంటే ముగింపు ముఖ్యమైనది. సూర్యుని క్రింద అనేక ఆరంభములు జరుగుచున్నవి. కాని అవి ముగింపుకు రాక మధ్యలోనే ఆగిపోవుచ్చువి. అహంకారము అపాయమును తెచ్చును. కాని శాంతము ఎంతో గొప్పమేలును సమకూర్చును.

11-12 వ. సూర్యుని క్రింద జీవించువారికి జ్ఞానము స్వాస్థ్యమై ప్రయోజనమును చేకూర్చును. అది దైవిక జ్ఞానమని మనము తెలుసుకోవాలి. ఈలోక జ్ఞానము కాదు. అన్ని సమయముల యందును మనము జ్ఞానమును ఆశ్రయించవచ్చును. కొంత మంది ద్రవ్య సంబంధమైన స్వాస్థ్యమును ఆశ్రయించిన వారుకలరు. ద్రవ్యము జ్ఞానముతో కూడా అవసరమే. కాని జ్ఞానము లేని ద్రవ్యము ద్వారా నిజమైన మేలు దొరకదు. జ్ఞానము కలవాడు దైవికమైన జ్ఞానమును బట్టి ఆలోచించి దాని ప్రకారము నడచి ప్రాణమును కాపాడుకొనగలడు.

**13-14 వ. దేవుని క్రియలు ధ్యానించుట మేలుకరము :**

దేవుడు మన జీవితమును వంకరగానైనను, చక్కగానైనను చేయగలడు. దేవుడు చేసిన దానిని మనము మార్చలేము. కాని వంకరగా దేవుడు చేసినపుడు ఎందుకు వంకరగా

చేశాడో ధ్యానించాలి. అందులో మనకు స్థిరమైన మేలు ఉండును. అలాగే మానవ జీవితానికి సుఖ దుఃఖాలను జతపరచాడు. ఎందుకు అలాగుచేశాడో ధ్యానించుటమేలు. మనము చనిపోయాక ఏమిజరుగునో మనకు దేవుడు మరుగు పరచాడు. కనుక దుఃఖములు ఎందుకు కలుగుచున్నవనగా మనుష్యులు తమ్మనుతాము తగ్గించుకొని దేవుని యందు భయభక్తులు కలిగి జీవించుట నేర్చుకొనుటకేనని మనము గుర్తించాలి.

మానవ జీవిత ప్రయాణము అనేక వంకరలు, ఎత్తుపల్లములతో కూడినది. గాఢాంధకారపు లోయలో నేను సంచరించినను ఏ అపాయమునకు భయపడను అని కీర్త 23:4లో రాజైన దావీదు పలుకుచున్నాడు. జీవిత ప్రయాణములో దేవునికి ఇష్టుడైన దావీదే గాఢాంధకారవు లోయలలో సంచరిస్తే మనమందరము చీకటిలో సంచరించవలసినదే. దావీదు దేవునియందు భయభక్తులు గలవాడు గనుక యెహోవా కాపరియై నీకు లేమి చేయడని కీర్త. 23:1లో అంటున్నాడు. కనుక దేవుని యందు భయభక్తులు కలిగి ఉండుటయే మనకు క్షేమకరమను సారాంశమునకు ప్రసంగి మనలను నడిపించుచున్నాడు.

**15-22 వ. దేవుని యందు భయభక్తులు కలిగి జీవిత కాలములో దుర్మార్గపువనులు చేయకుండుటయేమేలు :**

15-18 వ. ఈభాగమందు చెప్పబడిన అధికనీతి స్వనీతి అని గుర్తించాలి. స్వనీతి కలవారు దేవుని ఆశ్రయించలేరు. తమ స్వనీతి మీద ఆధారపడి అందరికంటే తామే మంచివారమని తలంచుదురు. ఈస్వనీతి, స్వంతజ్ఞానము నాశనమునకే నడిపించును. కాని దైవసంబంధమైన నీతి, దైవసంబంధమైన జ్ఞానము దేవునియందలి భయభక్తుల వైపునకు మనలను నడుపుట ద్వారా జీవితమును భద్రపరచుకొనగలము.

19-20 వ. పాపము చేయక మేలుచేయు నీతిమంతుడు ఒక్కడును భూమి మీదలేదు. ఏ భేదము లేదు అందరును పాపము చేసిరని రోమా. 3:23లోను, నీతిమంతుడు లేడు ఒక్కడు లేడని రోమా. 3:11లోను చెప్పబడిన మాటలివియే. ఒక పట్టణమునకు 10 మంది అధికారులున్నను వారునీతిలేని వారుగను పాపము చేయు వారుగను ఉందురు. కనుక దైవసంబంధమైన జ్ఞానముగలవాడు, ఆజ్ఞానమును ఆధారము చేసికొని మేలు కలిగించును.

21-22 వ. చెప్పుడు మాటలను నీవు లక్ష్యపెట్టిన యెడల పనివాడు మనలను శపించును. అలాగే మనమును మనపైవాని శపించిన అనుభవములు మనజీవితములో నుండును. కనుక చెప్పుడు మాటలు లక్షపెట్టక దైవిక జ్ఞానముచే సమస్తము ఆలోచించాలి.

**23-29 వ. దేవుని యందు భయభక్తులుగలవాడు విడిపించబడుట - దుర్మార్గుడు విడిపింవ బడకుండుట :**

23-25 వ. దైవ సంబంధమైన జ్ఞానాభ్యాసము బహులోతైనది. దానిని పరిశీలనగా తెలుసుకొనుట కష్టతరము. అయినను దైవిక జ్ఞానాభ్యాసము తెలిసికొనుటకు ప్రసంగి మనస్సునిలిపెను. బుద్ధిహీనతయే భక్తిహీనతయని అవి వెర్రితనము లేయని ప్రసంగి గ్రహించెను.

26-29 వ. మానవులందరిలో యధార్థత లేదు. తంత్రములను కల్పించు కొందురు. ఇందులో స్త్రీ పురుష భేదములేదు. వేయి మంది స్త్రీలలో యధార్థవంతులు ఒక్కరును లేరు. ఉరులవంటి మనస్సు, బంధకములవంటి చేతులు గల స్త్రీలు పురుషులపై వల వేయగా ఎవడును స్వశక్తి చేత అవల నుండి తప్పించుకొనలేడు. కానిదేవుని దృష్టికి మంచివాడు దేవునియందు భయభక్తులుగలవాడు తప్పించుకొనును. ఆది. 39:7-9లో యోసేపు దేవుని దృష్టికి మంచివాడు కనుక పోతీఫరు భార్య యొక్క ఉరి నుండి తప్పింపబడి నీతిమంతుడని గుర్తింపబడెను. యోసేపు వంటివారు తప్ప మిగిలిన పురుషులందరును యధార్థవంతులుకారు. 28వ వచనములో చెప్పబడిన వేయి మంది పురుషులలో ఒకడు ప్రభువైన యేసే అని గమనించాలి. ప్రపంచమందు జన్మించిన పురుషులందరిలో ఆయన ఒకడే నిజమైన యధార్థవంతుడు.

## 8వ అధ్యాయము

9 + 8 = 17వ

అంశము : జీవితకాలమునకు క్షేమకరములు - సమాధానము - దైవభయము.

**1-9 వ. మానవుని వశమునలేని మరణదినము :**

1 వ. జ్ఞానులతో సములైనవారు ఎవరు ? అంటూ 17వ వచనములో జ్ఞానులు పూనుకొనినను సూర్యుని క్రింద జరుగుక్రియలను గూర్చి ఎంత ప్రయత్నించినను కనుగొనుట లేదని, కనుగొనజాలరని తెలిసికొంటినని చెప్పుచున్నాడు. దీనిభావమేమంటే మనుష్యుల జ్ఞానము పరిమితమైనది. దాని చేత తెలుసుకొనజాలని అనేక విషయాలు సృష్టిలో ఉన్నవని ఎరగాలి. మనుష్యుడు తన జ్ఞానము చేత మోటు తనమును మార్చు కొనగలడు. తనముఖమును ఈలోక తేజస్సుతో నింపుకొనగలడు. కాని జరుగబోవువాటిని, వాటి భావమును కనుగొనలేడు.

2-4 వ. రాజు తన ఆధీనమందు సంపూర్ణ అధికారముగలవాడు కనుక ప్రజలు రాజు కట్టడకు లోబడుచుండవలెను. రోమా. 13:1లో ప్రతివాడు పై అధికారులకు లోబడవలెనని చెప్పబడినది. రాజు సముఖమందు అనాలోచనగా నుండక, రాజును ప్రశ్నించక ఉండుట జీవితకాలమునకు క్షేమకరమని చెప్పుచున్నాడు. రోమా. 13:3లో

అధికారులను ఎదిరించువాడు దేవుని నియమమును ఎదిరించుచున్నాడు. ఎదురించువారు తమ మీదికి తామే శిక్ష తెచ్చుకొందురని చెప్పబడినది.

5-7 వ. ధర్మమునాచరించువానికి సర్వసాధారణముగా కీడేమి సంభవింపదు. అనుకూల సమయమందు న్యాయము జరుగునని చెప్పుచున్నాడు. ప్రతి సంగతిని విమర్శించు సమయము దేవుడు ఏర్పరచెను. ఇది మనుష్యులు గుర్తించి జాగ్రత్తగా ఉందురని లేనియెడల మనుషులు ఎటువంటి కీడైనను చేయుటకు వెనుకాడరని తెలుపుచున్నాడు.

8 వ. గాలి విసరకుండ చేయు అధికారమును దేవుడు మానవులకివ్వలేదు. ఒకవేళ ఇచ్చిన యెడల ప్రస్తుత కాలమందు సంభవించు పెను తుఫానుల నుండి తప్పించుకొనగలడు. కాని ఒకరు మరొకరికి గాలి విసరకుండ చేయుట వలన ప్రాణాపాయమును కలిగించగలరు. అందుచేత మానవునికి అటువంటి అధికారమివ్వలేదు. ఇలాగే మరణమును మానవుని వశమునకు అప్పగించలేదు. కాని జీవిత కాలమంతయు యుద్ధకాలముగానే ఉన్నది. యోబు 7:1లో భూమి మీద నరుల కాలము యుద్ధకాలము కాదా ? అంటున్నాడు. దీని నుండి మానవుడు విడుదల పొందలేడు. దుష్టత్వము ననుసరించు వారైన జీవితకాలమందలి యుద్ధమును తప్పించుకొనలేరు.

9 వ. అధికారులు క్రింది వారి ద్వారా హాని తెచ్చుకొందురని సెలవిచ్చుచున్నాడు.

**10-17 వ. దైవ భయములోనే క్షేమము :**

10 వ. మరణ దినము మానవ వశములో లేకపోవుటయేగాక క్రమముగా పాతిపెట్టబడుట కూడా మానవుని వశమున లేదు. అనేకసార్లు ఒకప్రాంతమునకు చెందినవారు వేరొక ప్రాంతములో ప్రయాణమందు ప్రమాదవశాత్తు మరణించి సరైన రీతిని పాతిపెట్టబడక యుందురు. ఇట్టిది ఎవరికైనను సంభవించగలదు. అనేక మంది మిషనరీలు తమదేశములను విడచి ఇతరదేశములకు వెళ్ళినవారు సేవలో మరణించినపుడు, లేదా ప్రయాణమందు మరణించినపుడు వారు సరియైన రీతిలో పాతి పెట్టబడలేదు. అదోనీరామ్ జడ్సన్‌గారు ఇంగ్లండు నుండి బయలుదేరి బర్మాలో గొప్పసేవ చేసిరి. చివరి దినములలో కలరా వ్యాధిసోకినది. ఆదినములో కలరాకు మందులేదు. బర్మావారు పడవపై ఎక్కించి ఇంగ్లాండుకు పంపిరి. కాని సముద్రములో మార్గమధ్య మందు మరణించగా ఇతర ప్రయాణికులకు కలరావ్యాధి సోకకుండునట్లు శవమును ఎత్తి సముద్రములో పారవేసిరి. కనుక సరియైన సమాధిలేదు.

డేవిడ్ లివింగ్ స్టన్ ఆఫ్రికాలో సేవ చేయుచుండగా ప్రయాణమార్గమందు ఒక సింహము చంపి శరీరములోని కొంతభాగమును తినెను. తరువాత మిగిలిన జంతువులు మిగిలిన భాగమును తినెను. ఈయనకు సమాధిలేదు శరీరభాగములను పలుజంతువులు తిని జీర్ణించుకొని బహిర్భూమిలో వేరు వేరు స్థలములలో విడచినవి.

11-13 వ. నరుల చెడుతనము భూమి మీద గొప్పదని ఆది. 6:5లో చెప్పబడినది. దేవుడు వారిపైకి జల ప్రళయమును పంపుట ద్వారా శిక్షించాడు. శిక్షవెంటనే కలుగక పోవచ్చును. ఆది. 18:21లో సొదమ మనుష్యుల పాపము సంపూర్ణమైనదో లేదో వెళ్ళి చూతునని దేవుడు చెప్పుచున్నాడు. కనుక దుష్క్రియకు తగిన శిక్ష శీఘ్రముగా కలుగక పోవచ్చును. దేవుడు తన సమయమందే శిక్షించును. శిక్ష వెంటనే కలుగనందున మనుష్యులు భయము విడిచి హృదయ పూర్వకముగా పాపము చేయుదురని 11 వ. లో చెప్పుచున్నాడు. కనుక పాపాత్ములు నూరు దుష్కార్యములు చేసినను, దీర్ఘాయువు కలవారివలె ఉందురు. కాని దేవుడు తన సమయమందు వారిని శిక్షించునని గమనించాలి. దేవుని యందు భయభక్తులు గలవారు శ్రమలు, నిందలు, బాధలు, అనుభవించుచున్నందున లోకమునకు వేడుకగా నుందురు. కాని నిజమైన క్షేమము కలిగియుందురని గమనించాలి. భక్తిహీనులు దేవునికి భయపడరు. కనుక వారి క్షేమము నిజమైనదికాక నీడవంటిదేనని అనగా నిజమైనది కాక ఎండమావియేనని గమనించాలి. లూకా 16:19-31లోనున్న లాజరు ధనవంతుని భాగమును ఆలోచిద్దాము. ధనవంతునికి ఈలోక క్షేమము తాత్కాలికమైనది. పాతాళములో నిత్యము బాధననుభవించు చున్నాడు. (లూకా 16:23-24) లాజరు దేవుని యందు భయభక్తులు గలవాడై ఈలోకమందు శ్రమలు అను ఇబ్బంది కొలిమిలో పరీక్షించబడ్డాడు. చివరకు అబ్రహాము రొమ్ములో పరదైసు నందు సుఖము అనుభవించు చున్నాడు. (లూకా 16:25).

14-15 వ. ఒకడు తన జ్ఞానము ద్వారా దేవుని అంగీకరించి దేవుని యందు భయభక్తులు గలవాడైనను లూకా 16:25లో చెప్పబడినట్లు లాజరు భూలోకములో శ్రమలు అనుభవించినందున లోకములోని ఇతర భక్తిహీనులు అనుభవించినట్లే లాజరు కూడా అనుభవించినట్లు కన్పించుచున్నది. నీతిమంతులు సాధారణముగా నెమ్మదిగానున్నట్లు భక్తిహీనులు కూడా నెమ్మదిగా కొన్ని పర్యాయములు ఉండగలరు. కనుక ఇదంతయు వ్యర్థముగా ఉన్నట్లే కనబడును.

కనుక అన్నపానములు పుచ్చుకొని సంతోషించుట కంటే మనుష్యులకు క్షేమకరమైనదేదియు లేనట్లు ప్రసంగి కనుగొన్నాడు.

16-17 వ. కొద్ది మంది జ్ఞానాభ్యాసమునకై తమ సమయమంత నిద్రకానకుండ వినియోగింతురు. మరికొద్ది మంది వ్యాపారము చేయుటకై తమ సమయమంత నిద్రకాన కుండ వినియోగింతురు. కాని వాటి ద్వారా ఎంత ప్రయత్నించినను నిజమైన క్షేమమును కనుగొనజాలరని చెప్పబడినది.

అలాగు అనేక సంవత్సరములకు ఆస్తిని సంపాదించినవారితో దేవుడు లూకా 12:20లో వెర్రివాడా ఈ రాత్రియే నీ ప్రాణము నడుగుచున్నాను. నీవు సంపాదించినవి

ఎవరివగును అంటున్నాడు. కనుక నిజమైన క్షేమమును మానవుడు సూర్యుని క్రింద కనుగొనలేని స్థితిలో ఉన్నాడు. దేవుని యందు భయభక్తులు గలవారు (దీనులు) బహుక్షేమము కలిగి సుఖించెదరని కీర్త 37:11లో నున్నది. కనుక దేవుని యందలి భయభక్తులే ప్రాముఖ్యమైనవిగా గుర్తించాలి.

## 9వ అధ్యాయము

6 + 6 + 6 = 18వ

అంశము : వ్యర్థమైన ఆయుష్కాలమును గూర్చిన హెచ్చరిక.

**1–6 వ. దేవుని చిత్తమును బట్టి మంచివారికి పాపాత్ములకు ఏకరీతిగా జరుగుట :**

1 వ. మనుష్యులలో నీతిమంతులు, జ్ఞానులు దేవునివశములోనున్నారు. వారు చేయు క్రియలన్నియు దేవునివశమే. దేవుని సెలవులేక ఏ క్రియలు మానవులు చేయలేరు. అలాగే స్నేహము చేయుటయైనను, ద్వేషించుటయైనను దేవుని చిత్త ప్రకారమే జరుగును. యోబు గ్రంథములో తనకున్నముగ్గురు స్నేహితులు యోబు క్షేమమును కోరక యోబును నిందించుట ద్వేషించుట గమనించగలము. యోబు 23:10లో దేవుడు యోబును శోధించిన తరువాత తాను సువర్ణమువలె కనబడుదునని తలంచాడు.

దేవుడు యోబును శోధించుటకు సాతానుకు సెలవియ్యగా స్నేహితులు అలాగు తలంచక తప్పుగా ప్రవర్తించిరి. కనుక సమస్తమును దేవుని ప్రణాళిక ప్రకారమే జరుగునని యోబు వలె మనమును తలంచాలి.

2–6 వ. నీతిమంతులు అనగా దేవుని నమ్ముకొనినవారు. వీరే బలులు అర్పించువారు. ఒట్టుపెట్టుకొనని వారు; పవిత్రులు, మంచివారు. దుష్టులు అనగా దేవుని రక్షణను స్వీకరించనివారు, ఒట్టుపెట్టుకొనువారు, బలులు అర్పించనివారు, అపవిత్రులు, చెడ్డవారు. ఈ రెండు రకముల మానవులకు లోకములో సంగతులు ఏకరీతిగానే ఉన్నవి. సూర్యుని క్రింద జరుగువాటిలో ఇది బహు దుఃఖకరమని చెప్పుచున్నాడు.

మానవుని హృదయము బాల్యము నుండి చెడ్డదని ఆది. 6:54లో ఉన్నది. దేవుని రక్షకునిగా అంగీకరించని వారి హృదయములో గ్రుడ్డితనముండును. గ్రుడ్డివాడు అపాయమునకు గురియగునట్లు ఇటువంటివారు చివరకు, చనిపోవు వరకు గ్రుడ్డిగా ఉండి పాతాళమునకు పోవుదురు. మానవులు ప్రాణముతో ఉన్నపుడే సంగతులుసరిగా గ్రహించాలి. దేవునియందు విశ్వాసముంచాలి. దేవుని క్రింద తమ జీవితమును గడపాలి. సూర్యునిక్రింద అందరికి ఒకేరీతిగా జరిగినట్లున్నను దేవుని క్రింద ఆయనను నమ్మిన వారిస్థితి వేరుగానుండును.

**7-12 వ. వృద్ధమైన ఆయుష్కాలమున కష్టపడి పనిచేసి సంతోషముగా నుండుట :**

7 వ. సంతోషముగా భోజనము చేయుట దేవునివశమే అని ప్రసంగి 2:24,25; 3:12; 5:18లో నేర్చుకొంటిమి. దేవుని రక్షకునిగా స్వీకరించినవానికి అన్న వస్త్రములను ఆయన దయచేయును. లూకా 12:22-25లో వీటి కొరకు తన ప్రాణముతో తినుము త్రాగుము అని ఒకడు అంటున్నాడు. దేవుడు ఆ రాత్రియే అతని ప్రాణమును తీసుకొనిన (అడిగిన) తినలేదు, త్రాగలేదు. కనుక సంతోషముతో భోజనము చేయుట దేవుని వశమే. దేవుడు నీ క్రియలను అంగీకరించెను అనగా దేవుని చిత్తప్రకారము క్రియలు చేసిన వానికి దేవుని అంగీకారమున్నదని భావము.

8 వ. ఎల్లప్పుడు తెల్లని వస్త్రములు ధరించుకొనుట పండుగవాతావరణమును సూచించును. ఎస్తేరు 8:15లో యూదులు తమ విజయమును బట్టి సంతోషముతో విందు చేసుకొనినపుడు తెల్లని వస్త్రములు ధరించుకొనిరి. తలకు నూనె పూసుకొనుట అభిషేకమును సూచించును. రాజులు, యాజకులు, ప్రవక్తలు అభిషేకించబడి దేవుని సేవించిరి. కనుక నూనెచే అభిషేకింపబడుట దేవునికి చేయు ప్రీతికరమైన సేవయే.

9-10 వ. భార్యను ప్రేమించాలి, పోషించాలి. పోషించుటకొరకై కష్టపడి పనిచేయాలి. కనుక సూర్యుని క్రింద జీవించినంత కాలము పనిచేసి భార్యను పోషించి, ప్రేమించి, సుఖించమని చెప్పుచున్నాడు. కనుక ఈలోకములో ఉండగనే చేతికి వచ్చిన పనులు తప్పక చేయుచు జీవితకాలమును గడపాలి. చనిపోయిన తర్వాత ఎవరు ఏ పనియు చేయలేరు. ప్రభువైన యేసు జీవించిన కాలమందు యోహాను 6:38,9:4, 17:4లో తాను పనిచేసిన విధానము గమనించుట మనకు ప్రయోజనకరము.

1. నన్ను పంపిన వాని చిత్తము నెరవేర్చుటకు పరలోకము నుండి వచ్చితిని (యోహాను 6:38)

2. పగలున్నంత వరకు నన్ను పంపిన వానిక్రియలు మనము చేయు చుండవలెను. రాత్రి వచ్చుచున్నది అప్పుడెవడును పనిచేయలేడు. (యోహాను 9:4).

3. చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద నిన్ను మహిమ పరచితిని. (యోహాను 17:4)

11 వ. సూర్యుని క్రింద జరుగుకొన్ని అన్యాయములు చెప్పబడినవి.

1. వడిగలవారు పరుగులో గెలవాలి. కొన్నిసార్లు గెలవరు.

2. బలముగలవారు యుద్ధమందు గెలవాలి. కొన్నిసార్లు గెలవరు.

3. జ్ఞానముగలవారికి అన్నము దొరకాలి. కాని కొన్నిసార్లు దొరకదు.

4. బుద్ధిమంతులకు ఐశ్వర్యము దొరకాలి. కాని కొన్నిసార్లు దొరకదు.

5. తెలివిగలవారికి అనుగ్రహము దొరకాలి. కాని అలాగు దొరకదు.

ఇవన్నియు అదృష్టవశము చేతనే దొరకునని సూర్యుని క్రిందనున్నవారు తలంతురు. కాని దేవుని క్రింద ఉన్నవారు దేవుని సెలవు ప్రకారము అలాగు జరిగినదని గుర్తించుదురు. కనుక ఎట్టి స్థితిలోనైనను సంతోషించు చుందురు.

12 వ. మరణదినము మానవుల వశమునలేదు. మానవులకు తెలియదు. హఠాత్తుగా మరణము సంభవించును.

**13-18 వ. జ్ఞాన వంతులకు గుర్తింపు లేక పోయినను జ్ఞానము బలము కంటే గొప్పది కనుక శ్రేష్ఠమయినది :**

13-16 వ. ఒక చిన్న పట్టణమునకు ఒక బీదవాడు అధిపతిగానున్నాడు. తన జ్ఞానము ద్వారా ఆపట్టణము మీదికి దండెత్తి వచ్చిన గొప్పరాజు బారి నుండి ఆపట్టణమును రక్షించుకొనెను. కాని ఎవరును ఆబీదవానిని జ్ఞాపక ముంచుకొనలేదు. జ్ఞానము శ్రేష్టమే కాని బీదవాని జ్ఞానము తృణీకరింపబడినది. ఆ బీదవాడైన అధిపతి క్రీస్తుగాను, గొప్పవాడని పిలుపబడిన అధిపతి సాతానుగాను గుర్తింపగలము. యేసు ఈలోకమునకు బీదవాడుగా వచ్చి ప్రజలను వారి పాపముల నుండి సాతాను ఆధిపత్యము నుండి రక్షించెను. (మత్త. 1:21) కాని లోకము క్రీస్తును ఎన్నిక చేయక తృణీకరించెను.

17-18 వ. బుద్ధిహీనుడైన ఏలిక అనవసరమైన కేకలు వేయును. కాని జ్ఞాని శ్రేష్టమైన మాటలు పలుకును. కనుక జ్ఞానమే శ్రేష్ఠము. యుద్ధాయుధములను వాడుట వలన కాక జ్ఞానము ద్వారా దేశమును కాపాడుకొనగలము. సాత్వీకులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురని మత్తయి 5:లో చెప్పబడినది. కాని జ్ఞానము లేని ఒక పాపి అనేక మంచి పనులను చెడగొట్టువాడుగా నుండును.

## 10వ అధ్యాయము

3 + 4 + 4 + 4 + 5 = 20వ

అంశము : సూర్యుని క్రింద జీవితములో బుద్ధిహీనుని కంటే జ్ఞానియే శ్రేష్ఠుడు అను హెచ్చరిక.

**1-3 వ. వ్యక్తిగతముగా జ్ఞానులు - బుద్ధిహీనులు :**

1 వ. అత్తరుబుడ్డిలో ఒక చచ్చిన ఈగ పడినయెడల దుర్వాసన కొట్టును. ఒకవేళ అనేక చచ్చిన ఈగలు పడిన యెడల ఆదుర్వాసన గొప్పది. అలాగే ఒక వ్యక్తి జీవితములో ఎంతో జ్ఞానముగా నడచుకొని ఘనతను పొందినను కొంచెము బుద్ధిహీనతను కనబరచిన

యెడల ఈ బుద్ధిహీనతను త్రాసులో ఉంచగా జ్ఞానమంతటిని, ఘనత అంతటిని తేలగొట్టును.

2 వ. జ్ఞాని హృదయము కుడిచేతిని, బుద్ధిహీనుని హృదయము ఎడమ చేతిని ఆడించును. రాజు తన కుడివైపున ఉన్నవారిని చూచి నా తండ్రి చేత ఆశీర్వదింపబడిన వారలారా ... (మత్త. 25:34) ఎడమ వైపున ఉన్నవారిని చూచి శపింపబడిన వారలారా (మత్త. 25:41) అన్న వాక్యాలను బట్టి కుడి చేయి ఆశీర్వాదమునకు గుర్తు ఎడమ చేయి శాపమునకు గుర్తు.

అలాగైన యెడల జ్ఞాని తన హృదయ ఆలోచనలు, తలంపులు, ఊహల ద్వారా ఆశీర్వాదమును సంపాదించుకొనును. బుద్ధిహీనుడు తన హృదయ ఆలోచనలు, తలంపులు, ఊహల ద్వారా బుద్ధిహీనమైన వాటిని ఆలోచించి శాపమును సంపాదించుకొనును.

3 వ. హృదయమందలి చెడు తలంపులను బట్టి బుద్ధిహీనుని ప్రవర్తన చెడ్డదిగా నుండును కనుక తాను అధైర్యపడును. అతని క్రియలు కూడా బుద్ధిహీనముగా నుండును గనుక అందరికి తాను బుద్ధిహీనుడనని తెలియపరచుకొనును.

**4–7 వ. ఉద్యోగములో జ్ఞానులు – బుద్ధిహీనులు :**

4 వ. ఉద్యోగములో ఏలువారు లేక అధిపతులు, వారిక్రిందపనివారు లేక సేవకులు ఉందురు. వారిలో ఒకరు జ్ఞానులుగ, మరొకరు బుద్ధిహీనులుగ నుండగలరు. ఏలువాడు బుద్ధిహీనుడై అవసరమును బట్టి లేక నిర్నిమిత్తముగ కోపపడిన యెడల తనక్రిందనున్న పనివాడు బుద్ధిహీనుడై ఉద్యోగము నుండి తొలగిపోవుట సంభవించగలదు. కాని పనివాడు జ్ఞానియై ఓర్పుతో సహించిన యెడల ఉద్యోగము పోగొట్టుకొనుట అను గొప్ప పొరపాటు కలుగకపోవచ్చును. సమాజములో ఆరీతిగా అనేకులు ఉద్యోగములు పోగొట్టుకొని మరొక ఉద్యోగము సంపాదించలేక శ్రమల పాలైనవారు కలరు.

ఏలువాడు నిర్నిమిత్తముగా కోపపడినను దూషించినను జ్ఞానముగల పనివారు వాటినన్నిటిని ఓర్పుతో సహించి తమపనిని కాపాడుకొనినవారు అనేకులుగలరు.

5–7 వ. సమాజములో అనేక స్థలములలో బుద్ధిహీనులు గొప్ప ఉద్యోగములో ఉండుట ఘనులైనవారు తమక్రింద పనిచేయుట, పనివారుగా ఉండవలసినవారు అధికారులై గుర్రముల మీద కూర్చుండుట, అధిపతులుగా ఉండవలసినవారు సేవకులై నేలను నడచుట గ్రంథకర్త చూచినట్లు తెలుపుచున్నాడు.

ఆది. 39వ అధ్యాయములో జ్ఞానియైన యోసేపు బుద్ధిహీనులగు పోతీఫరు, అతని భార్య క్రింద బానిసపిల్లవాడుగా 17 సం॥ల వయస్సు నుండి 28 సం॥ల వయస్సు వరకు ఉండెను. సుమారు 10–12 సం॥లు జ్ఞానముతో దేవుని తోడు గలిగి జీవించి శోధనలను జయించినందును 41:40–41లో ఫరో నీ వలె జ్ఞాన వివేకములు కలవారు ఎవరును లేరు అనెను. ఫరో ఇంటికి అధికారిగాను (ఆది. 41:40) తర్వాత ఐగుప్తు

దేశమునకు అధిపతిగాను (అది. 41:43) నియమించబడెను. 1 పేతురు 5:6 ప్రకారము దేవుడు తగిన సమయమందు మనలను హెచ్చించునట్లు ఆయన బలిష్ఠమైన చేతి క్రింద దీనమనస్కులైయుండాలి.

అంతకు ముందు అది. 39:4లో పోతీఫరు ఇంటి మీద విచారణకర్తగాను అది. 39:22లో చెరసాలలో ఖైదీలందరిచేత పనులు చేయించువాడుగాను ఉండెను. అటు తర్వాత 41:57లో సమస్త దేశములకు ఆహారమును అమ్ము సంస్థకు అధికారి అయ్యెను (Head of the World food Trading Centre ) ఒకవేళ పోతీఫరు ఇంటిలో బుద్ధిహీనముగా ప్రవర్తించినయెడల పోతీఫరు భార్య చేతిలో ఒక కీలుబొమ్మవలె జీవితమంత గడిపి ఉండువాడు.

అలాగే దావీదు సుమారు 16 సం॥ల వయసులో ఉన్నాడు. దేవుడు బుద్ధిహీనముగా ప్రవర్తించిన సౌలును (1 సమూ. 13:13, 15:23) రాజుగా ఉండకుండా విసర్జించి దావీదును రాజుగా (1 సమూ. 16:13) అభిషేకించాడు. కానీ సుమారు 30 సం॥ల వయస్సు వచ్చువరకు అనగా 14 సం॥ల కాలము బుద్ధిహీనుడగు సౌలు క్రింద (16:11) ఆయుధములు మోయువాడుగాను, 18:5లో యోధుల మీద అధిపతిగాను, 18:13లో సహస్రాధిపతిగా ఉండెను. సౌలు 18:11లో దావీదును చంపగోరెను. సుమారు 21 పర్యాయములు దావీదు పై హత్యాప్రయత్నములు జరిగెను. 23:14లో సౌలు అనుదినము ఈ 14 సంవత్సరములు వెదకినను దేవుడు దావీదును సౌలుకు చిక్కనివ్వలేదు.

1 సమూ. 24:4లో మొదటిసారి, 26:11లో రెండవసారి దావీదుకు సౌలు చిక్కినను దావీదు చంపలేదు. 18:14లో దావీదు సుబుద్ధి (జ్ఞానియై) కలిగి ప్రవర్తించెనని ఉన్నది. దేవునిచే తృణీకరించబడి రాజుగా ఉండకుండ విసర్జింపబడిన సౌలు క్రింద జ్ఞానియైన దావీదు 14 సం॥లు ఉండుట ఎంతో ఓర్పుతో కూడిన విషయమే.

అపొ. 26:24 ప్రకారము అతివిద్యగల జ్ఞానియైన పౌలు తన జ్ఞానమును నిర్లక్ష్యపెట్టి క్రీస్తునందలి అతిశ్రేష్ఠమైన జ్ఞానము కొరకు ఫిలి. 3:8. ప్రకారము సమస్తమును నష్టపరచుకొని పెంటతో సమానముగా ఎంచుకొనెను. అనేక పర్యాయములు బుద్ధిహీనులగు ఫేలిక్సు, ఫేస్తు గవర్నరులు, అగ్రిప్పరాజు మొదలగు వారిచే అన్యాయములను అనుభవించెను (అపొ. 24, 25, 26 అధ్యాయములు).

మహాజ్ఞానియైన మన ప్రభువైన యేసు కూడా బుద్ధిహీనులగు మహాహేరోదురాజు, గవర్నరగు పిలాతుల క్రింద తనజీవితకాలమంతగడిపి నీతిమంతుడని పేరు పొందెను.

**8-11 వ. కార్యసిద్ధికి జ్ఞానమే ప్రధానము :**

8-10 వ. ఈ భాగమందు కొన్ని కార్యములు లేదా పనులు లేదా ఉద్యోగములను గూర్చి చెప్పబడినది. (1) గోతులు త్రవ్వుట (భూమిలోపల); (2) కంచె కొట్టుట (భూమి

మీద); (3) రాళ్ళు దొరిలించుట (భూమిపై కొంచెము ఎత్తున); (4) చెట్లు నరకుట (భూమిపై ఎత్తున); (5) ఆయుధములు వినియోగించి పనులుచేయుట (యాంత్రిక సంబంధమైనవి) భూమిలోపల, భూమిమీద, భూమిపైన, పనిముట్లతో చేయుపనులు యంత్రములతో చేయుపనులన్నిటిని గూర్చి చెప్పుచున్నాడు.

గోతులు త్రవ్వువారు అందరు అందులోపడరు. కంచెలో పాములుండవచ్చును కాని కంచెకొట్టు వారందరిని పాములుకరువవు. రాళ్ళను జ్ఞానముతో దొర్లించువారందరు గాయపడరు. జ్ఞానముతో చెట్లు నరుకువారు అపాయములను పొందరు. జ్ఞానముగలవాడు మొద్దుబారిన పనిముట్లను సానబెట్టును. బుద్ధిహీనముగా పై పనులు చేయువారు నష్టపోవుదురు, కష్టపడుదురు. కాని జ్ఞానముచే పై పనులు చేయువారు చక్కగా చేసికొందురు. కనుక కార్యసాధనకు జ్ఞానమే ప్రధానము.

11 వ. మంత్రములు, తంత్రములు కలవని కొద్దిమంది నమ్ముచున్నారు. బైబిలులో వీటికి ఆధారములేదు. పాములన్నియు ప్రాణాపాయమును కలిగించు విషపూరితమైనవి కావు. ఎక్కువ శాతము పాములు ప్రాణాపాయము కలిగించునవి కావు కనుక పాముకరచిన వారిలో ఎక్కువశాతము మరణించరు. అందుచే మంత్రగాడు వేసిన మంత్రపుకట్టును బట్టి మరణము సంభవించలేదని ప్రజలు తప్పుడు అభిప్రాయమును కలిగియున్నారు. కనుక మంత్రములు వాస్తవములు కాదు.

మరొక సంగతిని గమనించాలి. లూకా 13:10-17లో 18 ఏండ్ల నుండి బలహీనపరచు దయ్యము పట్టిన స్త్రీని ప్రభువు బాగుచేయుచు సాతాను ఈమెను బంధించెనని చెప్పుచున్నాడు. సాతాను, దురాత్మలు మానవులకు శరీర, మానసిక తొందరలను కలిగించగలరు. 11 వ వచనమందలి మంత్రము అను పదమునకు హెబ్రీ భాషలో 'లాచెస్' అని ఉన్నది. దానికి ప్రార్థన అను అర్థము కూడా ఉన్నది. ప్రార్థన చేసినపుడు పాము కరచినను ప్రార్థించువాడు హాని చెందదు. ప్రార్థన లేక పాము కరచిన వాడు హాని పొందగలడు. సాతానే ఒక ఘట సర్పము కనుక ప్రార్థనతో కార్యసిద్ధి కలుగ చేసుకొనవలెను.

దానియేలు 6వ అధ్యాయములో 120 మంది సంస్థానాధిపతులకు ముఖ్యుడై ఏ తప్పు చేయనివాడుగా దానియేలు ఉండెను. 120 మంది అధిపతులు పాములవలె కరచుటకు పూనుకొనిరి. దాని. 6:10 ప్రకారము ప్రార్థనాపరుడైన దానియేలు వారందరిని జయించ గలిగెను.

**12-15 వ. బుద్ధిహీనుల ప్రయాస ఆయాసకరము (భక్తిగలవారి ప్రయాస ఆయాసకరము కాదు) :**

12-15 వ. బుద్ధిహీనులు నోరు తెరచి మాటలాడిన యెడల బుద్ధిహీనమైన మాటలు వచ్చును. మాటల ముగింపు వెర్రితనముగా ఉండును. బుద్ధిహీనుడు సంగతులు

ఎరుగక విస్తారముగా మాటలాడుచుండును. ఆమాటలే వానిని మ్రింగివేయునని 12వ వచనములో చెప్పుచున్నాడు. బుద్ధిహీనులు తాముచనిపోయిన తర్వాత ఏమి జరుగునో తెలియని వారుగా ఉన్నారు. మానవులు తమజీవిత గమ్యస్థానము పరలోకమని ఎరుగవలసిన వారుగా ఉన్నారు. అది ఎరుగని బుద్ధిహీనులు వృధాగా ప్రయాసపడుదురు. వారు జీవితకాలమంతయు ఆయాసముగానే గడుపుదురు. కాని జ్ఞాని యొక్క నోటిమాటలు ఇంపుగ ఉండును. జ్ఞాని తన గమ్యస్థానము ఎరుగును. తన జ్ఞానముచే పరలోకము తన గమ్యమని గుర్తించును. తన జీవితములో పాపక్షమాపణ పొంది జీవితకాలమంతా దేవుని చిత్తమును నెరవేర్చుటకు ప్రయాసపడును. దేవుని కొరకు పడు ప్రయాస తేలిక. (మత్త. 11:28). ప్రభువునందు ప్రయాస వ్యర్ధము కాదు (1 కొ. 15:58).

**16-20 వ. దేశాధిపతికి జ్ఞానము యొక్క అవసరత - కలుగు ఫలము :**

16 వ. దేశాధిపతి దేశాభివృద్ధి మీద మనసు పెట్టాలి. దాసుడు రాజైన బాధ్యత లేనివాడుగా ఉండును. వాడు ఉదయమే భోజనమునకు కూర్చుంటాడు. ఇది దేశమునకు క్షేమముకాదు.

17 వ. రాజు గొప్ప ఇంటివాడై ఉండాలి. అనగా గొప్పమనసు గలవాడుగా ఉండాలి. అలాంటివాడు భోజన ప్రియుడై మత్తుగా ఉండడు. కార్యములు చేయుటకు అవసరమైన బలము కొరకే భోజనము చేస్తాడు. Eat to live, but not live to eat అను లోకోక్తిని ఇక్కడ గమనించగలము.

18 వ. సోమరి తనముచే ఇంటి కప్పు దిగబడిపోవును. అనగా దేశాధిపతి సోమరియైన యెడల ప్రభుత్వము కూలిపోవును. భారతదేశములో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రులు సోమరులో ఆరాష్ట్రప్రభుత్వాలు పడిపోవడము చూస్తున్నాము. బద్ధకము చేత ఇల్లు కురియును. కురియు ఇంటిలో నెమ్మది ఉండదు. అలాగే అధికారి బద్ధకముగా ఉండిన తన ప్రభుత్వములో నెమ్మది ఉండదు.

19 వ. అట్టివారు నవ్వులాటలకై విందుచేయుదురు. మద్యపానములో మునుగుదురు. ద్రవ్యమును దుబార ఖర్చు చేయుదురు. ద్రవ్యము అక్కరకు వచ్చునని దాచుకొనరు.

20 వ. దేశ ప్రజలు రాజును గూర్చి రహస్యముగా మాటలాడకూడదు. ఆకాశపక్షులు వర్తమానము కొనిపోవును. కనుక ఇబ్బందులు ఏర్పడును. కాబట్టి మౌనముగా ఉండుట క్షేమము.

## 11వ అధ్యాయము

4 + 4 + 2 = 10వ

అంశము : జీవిత కాలములోని వివిధ దశలకు హెచ్చరికలు.

**1-4 వ. జీవితంలో ప్రతిఫలాపేక్షలేని సహాయము చేసి దేవుని యొద్ద ఫలితమునకై కనిపెట్టుట :**

1 వ వచనములో చాలా దినములు, బ్రదుకు దినములు, చీకటిగల దినములు 8వ వచనములో చాలా సంవత్సరములు అని ఉన్నది. 11, 12 అధ్యాయాలలో జీవితంలోని వివిధ దశలను గూర్చి చెప్పుచున్నాడు. భూమి మీద ఎప్పుడు ఏమికీడు జరుగునో తెలియని వారముగా ఉన్నాము (2 వ). సమస్తమును జరిగించువాడు దేవుడే (5 వ). అయినను దేవుడు జరిగించు క్రియలు మానవుడు ఎరుగడు. సూర్యుని క్రింద మానవజీవితములోని సమస్తము వ్యర్థమని నిరూపించుట ముందు అధ్యాయాలలో జరిగినది. కనుక ఒక ప్రాముఖ్యమైన హెచ్చరికను 1 వ వచనములో చెప్పుచున్నాడు. నీ ఆహారమును నీళ్ళమీద వేయుము. చాలా దినములైన తరువాత అది నీకు కనబడును. దీని భావమేమి ? ఆహారము అనగా జీవిత అవసరత. నీరు దేవుని వాక్యము. కనుక జీవిత కాలమందలి వివిధ దశలలో ఎప్పుడు ఏమి జరుగునో ఎరుగని మానవుడు తన జీవిత విధానమంత దేవుని వాక్యముపై కట్టుకొనాలి, వాక్యముపైనే ఆధారపడాలి. దేవుని వాక్యములో వ్రాయబడినట్లు వాక్యవిధానములను నమ్ముకొని వాక్యమును హత్తుకొని వాక్య ప్రకారము జీవించాలి. దాని ఫలితము వెంటనే కనబడక పోయినను చాలాదినములైన తరువాత కనబడును. సూర్యుని క్రింద జీవితము అనగా దేవుడులేని జీవితము వ్యర్థమేకాని దేవుని క్రింద మానవజీవిత ప్రయాస వ్యర్థముకాదు (1 కొ. 15:58) కనుక దేవుని వాక్య ప్రకారమైన జీవితములో ఫలము వెంటనే రాకపోయినను చాలా దినములకైనను కనిపించును.

వేరొక తలంపుగా వాక్యమను ఆహారమును సకల జనములు అనే నీటిపై వేసిన యెడల ఆవాక్యము వృధా కాదు. అనేక దినములైన తరువాత దాని ఫలితము కొంతమందిలో కన్పించును. వారి జీవితములు క్రమపరచబడును. ప్రభువు నుండి ప్రతిఫలముగా మనము బహుమానము పొందుదుము.

2 వ. భూమిమీద ఎప్పుడు ఏమి జరుగునో తెలియని వారమైనందున మనకు కలిగిన వాటిని ఏడుగురికి పంచిపెట్టుట క్షేమకరము. (1 తి. 6:17-19). ఏడు సంపూర్ణము. ఎనిమిదవ దినమున క్రీస్తు పునరుత్థానుడైనందున ఎనిమిది అను సంఖ్య పునరుత్థాన బలమును సూచించును. పునరుత్థానబలము అపరిమితమైనది (ఫిలిపీ 3:11) ఈ బలము క్రీస్తును మృతులలో నుండి లేపినది. క్షణములో పరలోకమునకు కొనిపోయినది. మరల క్షణములో క్రీస్తును పరలోకము నుండి భూమిపైకి తెచ్చినది.

ఏడు అను సంఖ్య సంపూర్ణము కనుక ఎనిమిది మందికి అంటే సంపూర్ణత కంటే ఎక్కువమందికి భాగము పంచి పెట్టుట లేక సహాయము చేయుట అని అర్థము. ఎప్పుడైన ఏవిధమైన కీడు జరిగిన యెడల నీచే సహాయము పొందినవాడు నీకు మరల సహాయము చేయగలడు.

3 వ. వర్షముతో నిండి యుండిన మేఘములు భూమిపై కుమ్మరించుట - సమస్యలన్ని, కీడులన్ని మేఘములవలె నుండి మనమీద వర్షమువలె కుమ్మరించబడవచ్చును. వ్రూను పడిన చోటనే ఉండుట అనగా సమస్యలు కీడులు వర్షమువలె ఉండి మన మీద పడి, పడిన వ్రూనువలె అలాగే మనమీద ఉండవచ్చును. యోబు జీవితమును గమనించిన యెడల ఒక్కొక్క కీడు వరుసగా వర్షము కుమ్మరించ బడునట్లు వచ్చాయి. (1) ఎద్దులు పోవుట; (2) గొఱ్ఱెలు కాలిపోవుట; (3) ఒంటెలు చంపబడుట; (4) ఇల్లు కూలిపోవుట; (5) కుమారులు, కుమార్తెలు మరణించుట; (6) యోబు శరీరమంతయు కురుపులచేత మొత్తబడుట ఈలాగు కీడు మీద కీడు వర్షము వలె, వ్రూనులవలె పడ్డాయి. యోబు 5:19లో ఆరుబాధలు, ఏడు బాధలు కలిగినను ఆయన నిన్ను విడిపించును అని ఉన్నది. కనుక విడిపించు దేవునిపై ఆయన వాక్యముపై ఆధారపడాలి. యోబు అలాగు ఆధారపడి దేవుడు తన ఇష్టానుసారముగా నన్ను నలుపునుగాని, నేను ఆదరణ పొందుదును అన్నాడు (యోబు. 6:9-10).

గ్రుడ్డివారి లిపి కనుగొనిన బ్రెయిలీ దైవజనుడు. ఆయన చరిత్ర గమనించ తగినది. దేవునియందు విశ్వాసముంచిన ఆయన చూపును కోల్పోయి అంధుడైనాడు. అట్టిస్థితి కొరకై దేవుని స్తుతించి దేవుని చిత్తమును కనుగొన్నాడు. అంధత్వమను వ్రూను అతని మీదపడి తొలగక అతని జీవితకాలమంతా అతని మీద ఉన్నది. అట్టి దేవుని క్రియ ఎందుకో అతనికి అర్థము కాలేదు. పిమ్మట ప్రార్థించి దేవుని ఆనుకొనెను. బ్రెయిలీ అంధుడైనను నిరాశపడక చక్కగా చదువుకొని అంధులకై లిపిని కనుగొనెను. ప్రపంచమంతటిలో నున్న అంధులకది నేటి వరకు ఎంతో ప్రయోజనమును చేకూర్చినది.

**4-8 వ. అల్పమైన మానవ జ్ఞానముతో మానవుడు ఎరుగలేనివి :**

4-6 వ. గాలి ఏత్రోవను వచ్చునో మానవుడు ఎరుగడు. చూలాలి గర్భములో ఎముకలు ఎదుగురీతిని మానవుడు ఎరుగడు. గర్భమందు పిండము ఏర్పడి ఎదుగుచున్నదని మానవునికి తెలిసినా అది ఏరీతిగా ఎదుగునో మానవులకు పూర్తిగా అర్థముకాలేదు. మానవ శరీరములో ఒక లక్ష కిలోమీటర్ల పొడవుండు రక్తనాళములు ఏర్పడుచున్నవి. అలాగే వినుట, స్పర్శించుట, వాసనచూచుట, రుచించుట మొదలగు శక్తులు ఏర్పడు విధానము ఎంతో గొప్పది. కీర్త 139:15-16లో దేవుడు వీటన్నిటిని చూచుచున్నాడని వ్రాయబడినది. మేఘములను కనిపెట్టువాడు కోయడు అన్నట్లు వీటన్నింటిని గమనించు

మనము ఎంతో జాగ్రత్తగా నడచుకోవాలి. లేని యెడల మేఘమును గమనించక కోసినవాడు తాను కోసిన పైరును వర్షములో పోగొట్టుకున్నట్లు మన జీవితములో నష్టము కోయవలసి వచ్చును. దేవుని క్రియలను మనము ఎరుగము గనుక ఉదయము నుండి సాయంత్రము వరకు మనము దేవుని వాక్యమును నిత్యము ధ్యానించుచు ప్రకటించుచూ ఉండాలి. మంచి క్రియలను నిత్యము చేయుచుండాలి. వాటి ఫలితము ఎప్పుడు వచ్చునో మనమెరుగము.

7-8 వ. వెలుగు మనోహరమైనది. యోహా. 9:4లో యేసు పగలున్నంతవరకు నన్ను పంపిన వాని క్రియలు చేయుచుండాలి. రాత్రి వచ్చినప్పుడు ఎవరు పని చేయలేరన్నాడు. వెలుగు మనోహరమైనది కనుక మనము ఉదయము నుండి సాయంత్రము వరకు అనగా జీవిత కాలమంతా యేసుక్రీస్తువలె మనము ఏ పనులు చేయవలెనని దేవుడు కోరుచున్నాడో ఆపనులు చేయుచుండాలి.

జీవితములో చాలా సంవత్సరములు బ్రతికినను చీకటిగల దినములు అనేకములు వచ్చునని గమనించాలి. సామాన్యముగా రాజులు చీకటిలో సంచరించవలసిన పనిలేదు. కీర్త. 23:4లో గాఢాంధకారపు లోయలలో సంచరించినను అని రాజైన దావీదు అన్నాడు. దావీదు దేవునికి హృదయానుసారుడని చెప్పబడినది. దేవునికి హృదయానుసారుడైనవాడే చీకటిలో సంచరించవలసి వచ్చినప్పుడు ప్రతి విశ్వాసికి చీకటిలో గడపవలసిన దినములు చాలా రాగలవని గుర్తించాలి. చీకటి కాలపు అనుభవములు కూడా దేవుడు జరిగించునవే. వాటి ద్వారా దేవుడు మనకు అంతమున క్షేమమిచ్చును. కనుక బ్రదుకు దినములన్నియు హృదయములో సంతోషమును కలిగియుండాలి.

**9-10 వ. యవ్వనులకు నిజమైన హృదయసంతోషమును గూర్చిన హెచ్చరిక :**

యవ్వనమందు సంతోషపడుము. శరీరసంతోషము, లోకసంతోషములు కాదు. హృదయ సంబంధమైన సంతోషము అనగా మనసులో నిజమైన సంతోషము. మనస్సాక్షి నిర్దోషముగా కాపాడుకొనగలిగినవాడే హృదయమును సంతుష్టిగా ఉంచుకొనగలడు. శరీర సంతోషముకై పాపము చేయువాడు హృదయములో సంతుష్టిని కలిగి ఉండలేడు. దీని భావమేమనగా పాపము ద్వారా కలుగు శరీర, లోక సంతోషములు హృదయ సంతోషాన్ని ఇవ్వలేవు. హృదయములో క్రీస్తును కలిగినవారే హృదయమందు సంతుష్టిని కలిగి ఉందురు.

ప్రతి మనిషి దేహముతో జరిగించు ప్రతిక్రియను దేవుడు తీర్పుతీర్చును గనుక దేహమునకు చెరుపు చేయువాటికి మనము దూరముగానుండి హృదయములో వ్యాకులము లేకుండా చూచుకొనాలి.

12:2లో బాల్యకాలము. 12:3-8లో వృద్ధాప్యమును గూర్చి చెప్పబడినది. 11:9-10లో లేతవయస్సు, యవ్వనము, నడిప్రాయము ప్రస్తావించబడినది. (1) బాల్యము (0-12 సం॥); (2) లేతవయస్సు (13-19 సం॥); (3) యవ్వనము (20-33 సం॥); (4) నడిప్రాయము (34-55 సం॥); (5) వృద్ధాప్యము (55 సం॥ పైబడి) సామె 22:6లో బాలుడుగా నున్నపుడే నడవవలసిన త్రోవను నేర్చుకొనాలి. విలాప 3:2లో యవ్వనకాలమున కాడిని మోయుట నరునికి మేలు అని ఉన్నది. యెష. 40:30లో బాలురు సొమ్మసిల్లుదురు, యవ్వనులు తప్పక తొట్రిల్లుదురు అని ఉన్నది. క్రీస్తును హృదయములో చేర్చుకొనని బాలురు సొమ్మసిల్లుదురు. యవ్వనులు తొట్రిల్లుదురు. కనుక బాల్యదినములలోనే సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొని అనగా క్రీస్తును హృదయమునందు చేర్చుకొని రక్షింపబడాలి. లేత వయస్సులో, యవ్వనములో క్రీస్తుకాడి మోయాలి. అప్పుడు హృదయములో నిజమైన సంతోషముండును. ఆ సంతోషము వృద్ధాప్యము నందును కొనసాగును.

## 12వ అధ్యాయము

2 + 5 + 5 + 2 = 14వ

అంశము : జీవిత అంత్యదశను గూర్చిన హెచ్చరికలు - గ్రంథసారాంశము.

**1-2 వ. బాల్యదశకు హెచ్చరికలు :**

1-2 వ. 11వ అధ్యాయము 9-10 వచనాలలో బాల్యదినముల హెచ్చరికలు చెప్పబడినవి.

**3-7 వ. వృద్ధాప్య దశకు హెచ్చరికలు - జీవిత అంతము :**

2వ వచనములో తేజస్సునకు చీకటికమ్ముట అనగా శరీర తేజస్సు తగ్గు దినములు అనగా వృద్ధాప్యమే. పర. 6:10లో చంద్రబింబమంత అందము అని సూర్యుని అంత కళ అని చెప్పబడినందున శరీరములో అందము కళలకు చీకటికమ్ము దినములు అనగా వృద్ధాప్యమే. కనుక 3-7 వచనాలలో ఉన్న విషయములు అన్ని ఉపమాన రీతిగా వృద్ధాప్యమును గూర్చినవే. వాటి భావము గమనిద్దాము.

1. ఇంటి కావలి వారు వణకుట : సామాన్యముగా కావలి వాని చేతిలో కర్ర, తుపాకి, ఏదో ఒకటి కనబడును. కనుక కావలివారు వణకుట చేతులు వణకుటను సూచించును.

2. బలిష్ఠులు వంగుట : మానవులు తమ బలమును తొడలలోను, కాళ్ళలోను చూపించు చుందురు. కనుక బలిష్ఠులు వంగుట తొడలు బలహీనమై కాళ్లతో సరిగా నడవలేని వృద్ధాప్యకాలమే.

3. విసరువారు కొద్దిమంది అగుట, తిరుగటి రాళ్ళ ధ్వని తగ్గుట : నోటిలోని పండ్లు రాలిపోయి కొద్దిపండ్లు మిగులును కనుక కఠినమైన వాటిని నమలలేని వృద్ధాప్య కాలమే.

4. కిటికిలో గుండ చూచువారు కానకుండుట : కంటి చూపు కోల్పోయి సరిగా చూడవీలులేని వృద్ధాప్యకాలము.

5. వీధి తలుపులు మూయబడుట : ఇంటిలో తలుపులు మూయబడినపుడు శబ్దము సరిగా వినిపించదు. కనుక చెవులు సరిగా వినబడని కాలము వృద్ధాప్యకాలమే.

6. పిట్ట యొక్క కూతకు ఒకడు లేచుట : నిద్రసరిగా పట్టక కొద్దిపాటి శబ్దమునకు లేచువారు వృద్ధులే.

7. సంగీతము చేయు స్త్రీలు నిశ్శబ్దముగా ఉండుట : సంగీతమునకు స్వరపేటికలు చక్కగా ఉండాలి. స్వరపేటికలు సరిగా నుండని వయసు వృద్ధాప్యమే.

8. నాదము చేయువారు నిశ్శబ్దముగా ఉందురు : శృంగనాదము చేయుట గొంతుక చేయుపనియే. గొంతుకతో ఎక్కువసేపు నాదము ఊదలేని వయస్సు వృద్ధాప్యమే.

9. ఎత్తుచోటులకు భయపడుట : శరీరము బలహీనమై ఎక్కువ ఎత్తు ఎక్కలేకపోవుట వృద్ధాప్యమే.

10. మార్గమందు భయంకరమైనవి కనబడుట : మానసిక బలహీనతలను బట్టి లేనివాటిని ఉన్నట్లుగా తలంచి భయపడుట వృద్ధాప్యలక్షణమే.

11. బాదము వృక్షము పువ్వులు పూయుట : తలవెంట్రుకలు నెరసి సంపూర్తిగా తెల్లదనము తలపై కనిపించు వృద్ధాప్యమే.

12. మిడుత బరువుగా ఉండుట : మిడుత ఏ మాత్రము బరువైనదికాదు. శరీర బలహీనతలను బట్టి మిడుత కూడా బరువగు వయసు వృద్ధాప్యమే.

13. బుడ్డ బుడుసరకాయ పగులుట : బుడ్డబుడుసరకాయను తలకాయగా తలంచవచ్చు. తలకాయ పగులుట అనగా మెదడు చనిపోవుట (Brain Dead) ఇది మరణమునకు గురుతు. అందుకే 5వ వచనములో ఒకడు తన నిత్యమైన ఉనికి పట్టుకుపోవుచున్నాడని వ్రాయబడినది. మరణించినపుడు ఏడ్చువారు వీధులలో కనబడుదురు.

14. వెండి త్రాడు విడిపోవుట : వెండి తెలుపుగా ఉండును. త్రాడు అనగా చైను. అనేక లింకులు గల తెల్లనైన త్రాడు వంటి భాగము వెన్నెముకయే. వెండిత్రాడు విడిపోవుట అనగా వెన్నెముక బలహీనమై నడుము విరుగుటను సూచించును.

15. బంగారు గిన్నె పగిలిపోవుట : శరీరములోని తల గిన్నె వంటిది. మరియు శరీరమందలి అన్ని భాగములకు తల బంగారు వంటిది. బంగారుగిన్నె పగులుట మరణమునకు సూచన.

16. ధార యొద్దకుండ పగిలిపోవుట : శరీరములో కుండవంటి భాగము ధారగల భాగము మూత్రపిండములు. మూత్రపిండములు చెడిపోయి దెబ్బతినుట మరణమునకు దారితీయును.

17. బావి యొద్ద చక్రము పడిపోవుట : బావి నుండి నీటిని చక్రము త్రిప్పుట ద్వారా చేదుదురు. విద్యుత్తుతో నడచుపంపులకైన ఒక చక్రముండును. చక్రము పడిపోయినపుడు బావి నుండి నీటిని చేదలేరు. శరీరమను బావిలో నుండి గుండె రక్తమును ప్రతి నిముషానికి 70 సార్లు తోడుచుండును. చక్రము పడిపోవుట అనగా గుండె ఆగిపోవుట. మరణము సంభవించుట తర్వాత 7వ వచనములో ఉన్నట్లు మన్నయిన శరీరము మంటికి అనగా సమాధి చేయబడుతుంది. కాని ఆత్మ దాని దయచేసిన దేవుని యొద్దకు వెళ్ళును. 14వ వచనంలో ఉన్నట్లు తీర్పు జరుగును. హెబ్రీ 9:27లో మనుష్యులొక్కసారే మృతి పొందుదురు. అటు తరువాత తీర్పు జరుగును అని వ్రాయబడినది. ఇందులో క్రీస్తును నమ్మినవారికి, నమ్మనివారికి గల తీర్పు ప్రస్తావించబడినది. 2 కొరి. 5:10లో ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచి వైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును పొందుటకు మనమందరము క్రీస్తు న్యాయపీఠము దగ్గర ప్రత్యక్షము కావాలని ఉన్నది. ఇది విశ్వాసుల తీర్పు.

ప్రక. 20:11-15లో ధవళమైన మహాసింహాసనము, దానిపై ఆసీనుడైన క్రీస్తు, ఆయన ఎదుట నిలువబడిన మనుష్యులు, గ్రంథములలో వ్రాయబడిన దానిని బట్టి తీర్పు, శిక్షగా అగ్ని గుండములో వేయబడుట వివరించబడినది. ప్రియపాఠకా నీవు క్రీస్తును రక్షకునిగా నమ్మితివా లేదా ? నీకు నీవే జవాబు చెప్పుకొనాలి.

**8-12 వ. ముగింపు మాటలు :**

8 వ. ఇందులో సమస్తము వ్యర్థమని రెండు సార్లు చెప్పుచున్నాడు. గ్రంథ ప్రారంభమునందు మొదటి అధ్యాయము రెండవ వచనంలో సమస్తము వ్యర్థమని ప్రారంభించి గ్రంథము చివరలో సమస్తము వ్యర్థమని ముగించుచున్నాడు. సూర్యుని క్రింద జీవితమంతయు వ్యర్థమే అని సారాంశమును తెలుపుచున్నాడు.

9 వ. ప్రసంగియైన సొలొమోనుకు దేవుడు 1 రాజు 5:12లో విశేషజ్ఞానము ఇచ్చాడు. సొలొమోను అనేకులకు జ్ఞానము బోధించాడు. ఆలోచించి పరిశీలించి అనేక సామెతలను అనుక్రమ పరచాడు. 1 రాజు 4:32లో సొలొమోను 3000 సామెతలు పలికాడని ఉన్నది. బైబిలు గ్రంథమందలి సామెతల గ్రంథములో 952 వచనములే ఉన్నవి. ఈ వచనమును బట్టి ప్రసంగి గ్రంథము, సామెతల గ్రంథము వ్రాయబడిన తర్వాతనే వ్రాయబడెను.

10 వ. అనేక ఇంపైన మాటలు వ్రాయబడినను అవి సత్యములని యథార్థభావము కలవని తెలుపబడినది. ఈ జ్ఞానపు మాటలు ములుకోలలు అని చెప్పబడినది. అపొ. 26:14లో యేసే ములుకోలని చెప్పబడినది. ఆయన వాక్యమే జ్ఞానపు ములుకోలు బైబిలు గ్రంథమందలి 31173 వచనములన్నియు ములుకోలలే.

న్యాయాధి 3:30లో షమ్గరు అను న్యాయాధిపతి మునుకోల కర్రతో 600 మంది ఫిలిష్తీయులను హతము చేసి ఇశ్రాయేలీయులను రక్షించెననియున్నది. ఫిలిష్తీయులు సాతాను దూతలకు గుర్తు. అపవాదిని వాని దూతలను జయించుట దేవుని వాక్యమైన ములుకోలయే తగినది. మత్త. 4 అ.లో ప్రభువును అపవాది శోధింపగా వాక్యమనే ములుకోలలతో జయించగలిగాడు. అపవాదిని జయించుటకు దేవుని వాక్యమే అవసరమైనది.

సేద్యము చేయునప్పుడు వ్యవసాయదారుడు ఎద్దులను సరియైన మార్గమునకు మళ్ళించుటకు ములుకోలను వాడును. అలాగే విశ్వాసయాత్రలో మనలను సరియైన మార్గమునకు మళ్ళించునది దేవుని వాక్యమే. సేవయను కాడికి మనలను అలవాటు చేయునది దేవుని వాక్యమే. ములుకోల నొప్పి కలిగించినట్లు దేవుని వాక్యము మనలను నొప్పించినట్లున్నను మన ఆత్మీయ జీవితమును, సేవను క్రమపరచుటకు వాక్యము అవసరమైనదని గుర్తించాలి.

వాక్యము బిగకొట్టబడిన మేకు వంటిది. పడవలను తాడుతో మేకులకు కట్టుదురు లేనియెడల సముద్రపు ఆటుపోటులకు పడవలు మునిగిపోవును. కనుక విశ్వాసులు వాక్యమను మేకుకు కట్టబడినవారై వాక్యమందే నిరీక్షణ కలిగియుండాలి. వాక్యము కాపరియైన క్రీస్తును మనకు పరిచయము చేసినది. కనుక దేవుని వాక్యమే విశ్వాసికి ప్రాముఖ్యము. అనేక పుస్తకములు లోకములో వ్రాయబడినవి. ఇంకను వ్రాయబడుచున్నవి. కాని దేవుని వాక్యమే స్థిరమైనది. లోకసంబంధమైన జ్ఞానాభ్యాసము దేహమునకు ఆయాసకరము మరియు విస్తారమైన దుఃఖము కలుగచేయును (12:12; 1:18).

**13-14 వ. ఫలితార్థము :**

13 వ. లో దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన కట్టడలననుసరించి నడచుకొనుట ఒక్కటే మానవకోటికి విధియని చెప్పుచున్నాడు. దేవునియందు భయభక్తులను గూర్చి (1) 2:26; (2) 3:14; (3) 5:7; (4) 7:18; (5) 8:12లో చెప్పుచూ చివరకు మానవ కోటికి అదియే విధియని చెప్పుచున్నాడు.

1. 2:26 దైవ దృష్టికి మంచివాడుగా నుండువానికి (భయభక్తులు గలవానికి) దేవుడు జ్ఞానమును, తెలివిని, ఆనందమును అనుగ్రహించును.
2. 3:11-14 దేవుడు సృష్టిలోని సమస్తము చక్కగా జరుగునట్లు శాశ్వతముగా నియమించాడు. కాని మానవ జ్ఞానము దేవుని క్రియలను పరిశీలనగా

తెలుసుకొనుటకు చాలదు. కనుక దేవుని వైపు సహాయమునకై మానవులు తిరుగవలెను. మనుష్యులు తనయందు భయభక్తులు కలిగి యుండునట్లు దేవుడు ఇట్టినియమము చేసియున్నాడు.

3. 5:17, మానవునికి ప్రవర్తన ప్రాముఖ్యము. ప్రవర్తనను కాపాడుకొనుచు దేవుని మందిరానికి వెళ్ళాలి. నీమట్టుకు నీవు దేవుని యందు భయభక్తులు కలిగియుండుము అను హెచ్చరిక ఇవ్వబడినది.

4. 7:13, 14, 18 : దేవుని క్రియలు ధ్యానించుము. ఆపద్దినమును, సుఖదినమును గూర్చి యోచించాలి. దేవుని యందలి భయభక్తులు గలవారు వాటినన్నిటిని కొనసాగింతురు.

5. 8:12, 17 మానవులు సూర్యుని క్రింద చేయు సమస్త వ్యాపారములు వాటి ముగింపును ఎంత ప్రయత్నించినను కనుగొనలేరు. కాని దేవుని యందు భయభక్తులు కలిగి ఆయన సన్నిధికి భయపడువారు అన్నిటిలో క్షేమముగా ఉందురు. కనుక దేవునియందలి భక్తియే ప్రయోజనకరమైనది.

6. 12:13. పైన చెప్పినవాటి సారాంశముగా దేవుని యందు భయభక్తులు కలిగియుండుటయే మానవకోటికి విధి. ఏలయనగా గూఢమైన ప్రతి అంశమును గూర్చి దేవుడు తీర్పు తీర్చి ఫలమిచ్చును. ఫలము యొక్క వివరములు 1 కొరి. 3:13-15, 2 కొరి. 5:10లో చూడగలము.

7. 1 కొరి. 3:13-15 పునాది మీద బంగారము, వెండి, వెలగలరాళ్ళు, కఱ్ఱ, గడ్డి, కొయ్యకాలు మొదలైన వాటితో కట్టినయెడల.... అగ్నియే పరీక్షించును. పని నిలిచిన జీతము, లేకున్న నష్టము.

8. 2 కొరి. 5:10 తాను జరిగించిన క్రియల చొప్పున అవి మంచివైనను సరే చెడ్డవైనను సరే దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతివాడు పొందును.

దేవుని యందు భక్తిగలవాడు యేసుక్రీస్తును రక్షకుడుగా అంగీకరించును. తరువాత జీవితకాలమంతా దేవునియందలి భయభక్తులతో జీవించాలి. అలాగు జీవించువారు ప్రసంగి 2:26 ప్రకారము సంతోషముగాను ప్రసంగి 8:12 ప్రకారం క్షేమముగాను ఉందురు. ఈ లోకము విడచి ప్రభువు సన్నిధికి వెళ్ళినపుడు 2 కొరి. 5:10 ప్రకారము తీర్పు తీర్చబడి 1 కొరి. 3:13 ప్రకారము బహుమానము పొందుదురు. కనుక దేవుని యందలి భయభక్తులే మానవునికి అవసరమైనవి. ఈలోకమందును, రాబోవు లోకమందును అన్ని విషయములలో ప్రయోజనకరమైనవి.



ప్రసంగి జ్ఞానియై యుండెను

